aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people."
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
సోమవారం
13-07-2026 సంపుటి : 01 సంచిక :111 పేజీలు : 08 వెల : ₹ 5/-

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

# కాంగ్రెస్ ద్రోహం చేసింది



- తమిళనాడులో ఇండియా కూటమిలో విభేదాలు.
- విజయ్ నేతృత్వంలోని టీవీకే తో పొత్తును తిరస్కరించిన డీఎంకే.
- కాంగ్రెస్ తమను రాజకీయంగా ద్రోహం చేసిందని డీఎంకే ఆరోపణ.
- బీజేపీకి వ్యతిరేకంగా ఐక్యత కోరుతున్న కాంగ్రెస్, విసికే .

చెన్నై –జూలై 12 (మహాప్రభ)

తమిళనాడు ఇండియా కూటమిలో విభేదాలు తారాస్థాయికి చేరాయి. రాష్ట్ర స్థాయిలో రాజకీయాలు ఎలా ఉన్నా జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కోవడానికి సహకరించుకోవాలని విజయ్ ప్రభుత్వంలో కీలక పార్టీగా ఉన్న వీసీకే పిలుపునిచ్చింది. ఈ ప్రతిపాదనకు కాంగ్రెస్ కూడా మద్దతు తెలిపింది. టీవీకేను ఇండియా కూటమిలోకి తీసుకురావాలని వీసీకే పిలుపును డీఎంకే వ్యతిరేకించింది. కేరళ, పశ్చిమ బెంగాల్ తరహా రాజకీయ విధానాన్ని అనుసరించాలని వీసీకే అధినేత -మిగతా 3 లో

# స్పామ్ కాల్స్ ఫియర్!

## రోజూ కోటిన్నరకు పైగానే





- అప్రమత్తంగా ఉండాలన్న టెలికాం శాఖ
- 1600 సిరీస్ నంబర్లతో కాల్స్
- ఈ సిరీస్ ఫోన్ కాల్స్ నంబర్లను బ్లాక్ చేయలేరు
- 140 నంబర్ల విషయంలో కన్ఫ్యూజన్ వద్దంటున్న ట్రాయ్

న్యూఢిల్లీ,–జూలై 12 (మహాప్రభ)

మీకు 1600, 140 సిరీస్ నంబర్ల నుంచి పదేపదే కాల్స్ వస్తున్నాయా? అయితే, మోసపోవద్దు.. స్పామ్ కాల్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని ట్రాయ్ వినియోగదారులను హెచ్చరిస్తోంది. అయితే, నియంత్రిత సంస్థలు, -మిగతా 3 లో

# నామినేటెడ్ దక్కేదెవరికి?

## మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం



- చైర్మన్ల పనితీరుపై సీఎం రేవంత్ వద్ద నివేదిక
- 37 మంది చైర్మన్ల పదవీకాలం ముగింపు.. కొత్త నియామకాలపై దృష్టి
- ఒక్కో పదవికి పది మంది పోటీ.. నేతల్లో పెరిగిన ఆశలు
- పదవుల కోసం ఢిల్లీ స్థాయి వరకు కొనసాగుతున్న లాబీయింగ్
- తాజా మాజీ చైర్మన్లకు మరో అవకాశం ఇచ్చే యోచన
- ఎమ్మెల్యేలకు కీలక కార్పొరేషన్ల చైర్మన్ పదవుల ఛాన్స్

హైదరాబాద్ –జూలై 12 (మహాప్రభ)

నామినేటెడ్ పదవుల విషయంలో ఎవరికి రెన్యువల్ చేయాలి? ఎవరిని పక్కన పెట్టాలి? కొత్తగా ఎవరికి అవకాశం ఇవ్వాలి? అనే అంశంపై పార్టీ, ప్రభుత్వ పెద్దల్లో పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి. పనితీరు ఆధారంగా నియామకాలు జరపాలని భావిస్తున్న సీఎం రేవంత్.. పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సమక్షంలో తుది నిర్ణయం తీసుకునే యోచనలో ఉన్నట్టు తెలిసింది. ఈ నెల 14న పార్టీ ఇన్చార్జి మీనాక్షి హైదరాబాద్ కు రానున్నారు. 15 లేదా 16 తేదీల్లో నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమై నామినేటెడ్ పదవుల నియామకంపై తుది నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

-మిగతా 3 లో





## నేపాల్‌లో మళ్లీ జెన్‌జీ

# ఉద్యమం..

- ముగ్గురి ఆత్మాహుతి యత్నం
- నిరుద్యోగంపై యువత ఆగ్రహం
- ప్రధాని రాజీనామాకు డిమాండ్

కాఠ్మాండూ –జూలై 12 (మహాప్రభ)

నేపాల్ యువతలో పెరుగుతున్న అసంతృప్తి మరోసారి వీధుల్లో నిరసన రూపం దాల్చింది. గత మూడు రోజుల్లో ముగ్గురు యువకులు పెట్రోల్ పోసుకొని ఆత్మాహుతి యత్నం చేశారు. ఇందులో ఇద్దరు చనిపోయారు. ప్రధాని బాలేంద్ర షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువత కాఠ్మాండూ వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేశారు. బాలేంద్ర షా ప్రజా వ్యతిరేక, నిరంకుశ ధోరణిలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని జెన్–జీ నేపాల్ ఆర్గనైజేషన్ ఆరోపించింది. యువత ఉపాధి, ఆదాయం పెంచేందుకు బడ్జెట్‌లో, విధానాల్లో ప్రభుత్వం ఎలాంటి నిర్మాణాత్మక చర్యలు తీసుకోలేదని విమర్శించింది. యువతలో ఆశ, విశ్వాసం -మిగతా 3 లో



## నేడు పోలవరంకు

# సీఎం చంద్రబాబు


- పటిష్ట భద్రత ఏర్పాట్లపై అధికారుల సమీక్ష
- పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్న ముఖ్యమంత్రి
- ఏలూరు జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష
- హెలిప్యాడ్, సభా ప్రాంగణం, భద్రతపై అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ భేటీ

అమరావతి –జూలై 12 (మహాప్రభ)

ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం సందర్శించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లపై అధికారులు విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన దృష్ట్యా ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆధ్వర్యంలో -మిగతా 3 లో


# తెలుగు రాష్ట్రాలకు వర్షాలు

- వచ్చే 3 రోజులు వానలే వానలు
- హెచ్చరించిన వాతావరణ శాఖ



3

# హెర్ముజ్ మళ్లీ మూసివేత..



- ప్రకటించిన ఇరాన్.. అదేం లేదన్న అమెరికా
- జలసంధిపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు
- చమురు, ఎల్పీజీ దిగుమతులపై భారత్‌కు ఆందోళన
- కొనసాగితే ముందుగా గ్యాస్ కొరతే!
- బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ ఎగబాకిన వైనం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతపై కేంద్రం అప్రమత్తం
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన మార్కెట్లలో ఉత్కంఠ

3లో

# ఎల్నినోను ఎదుర్కొంటాం.

- నేడు ఇక్రిశాట్‌లో మంత్రి తుమ్మల సమీక్ష
- మూడు కంటింజెన్సీ ప్రణాళికలను పరిశీలించి తుది రూపునకు కసరత్తు



హైదరాబాద్ –జూలై 12 (మహాప్రభ)

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాలను దృష్టిలో పెట్టుకుని నేడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ, ఉద్యానవన శాఖ, భూగర్భ జల విభాగం అధికారులతో ఇక్రిశాట్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, వాతావరణ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్తలతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ వరాభావ పరిస్థితులను ఎదుర్కొనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. మూడు దశల్లో కంటింజెన్సీ-మిగతా 3 లో



## పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే

# మేడిగడ్డపై కుట్ర

- గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ
- ఇగో పక్కన పెట్టి తెలంగాణ రైతులను ఆదుకోండి
- ఎన్టీపీసీతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పవు
- మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

3లో



# కన్నీటి వీడ్కోలు

- మైసూరులో అధికారిక లాంఛనాలతో జానకమ్మ అంత్యక్రియలు పూర్తి
- కనియనహుండి ఫామ్‌హౌస్‌లో దహన సంస్కారాలు
- అంతిమయాత్రలో పోటెత్తిన అభిమాన సంద్రం
- మహారాజా కాలేజీ మైదానంలో సినీ ప్రముఖుల నివాళి
- మనవరాలు అప్సర చేతుల మీదుగా అంతిమ సంస్కారాలు

మైసూరు -జూలై 12 (మహాప్రభ)

గానకోకిల ఎస్. జానకి అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. కర్నా టక ప్రభుత్వం జానకమ్మ అంత్యక్రియలను మైసూరులో అధికారిక లాంఛనాలతో జరిపించింది. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకమ్మ కోరిక మేరకు కణియనహుండి ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అభిమాని ఫామ్ హౌస్ లో అంత్యక్రియలు హెచ్.డి. కోటే తాలూకాలోని కనియనహుండి గ్రామంలో ఉన్న ఒక వ్యవసాయ క్షేత్రంలో సాయంత్రం జానకి అంత్యక్రియలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి

-మిగతా 3 లో

# పేరు మార్చుకోవాలంటే ఎలా?

- 105 అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ జెండాలు ఎగరేశాం
- ఈసీకి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత రిప్లై

3లో



# హత్యకు కుట్ర భగ్నం..

**లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు షూటర్‌లు అరెస్ట్**



**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
ఢిల్లీ పరిధిలోని రోహిణి జిల్లా ప్రత్యేక పోలీసు దళం తాజాగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ముగ్గురు షూటర్ల ను అరెస్ట్ చేసింది. వారు ఢిల్లీలో ఓ హత్యకు కుట్ర చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించిన పక్కా సమాచారం ముందుగా అందడంతో రోహిణి జిల్లా స్పెషల్ స్టాఫ్ వీరి కదలికలపై నిఘా ఉంచి చివరకు అదుపులోకి తీసుకుంది. విదేశాల్లో ఉన్న నెట్‌వర్క్ ద్వారా ఈ షూటర్లకు ఆదేశాలు అందుతున్నాయని, వాటి ఆధారంగానే వీరు ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నారని సమాచారం.ఢిల్లీలో గతంలో జరిగిన పలు నేరాల్లో ఈ షూటర్లు నిందితులుగా ఉన్నారు. గతంలోనూ వీరు నిర్దేశిత లక్ష్యాలపై కాల్పులు జరిపిన ఘటనల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అమెరికాలోనూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌పై అక్కడి దర్యాప్తు సంస్థలు గట్టి నిఘా పెట్టాయి. జూలై 7 నుంచి అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఈ ముఠాపై 'ఆపరేషన్ హార్డ్ బాల్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకున్నారు. లారెన్స్ బిష్ణోయ్ ముఠాతోపాటు అతడి ప్రధాన అనుచరులైన గోల్డీ బ్రార్, జగ్గూ భగవాన్‌పురియా నెట్‌వర్క్‌లను లక్ష్యంగా చేసుకుని ఈ చర్యలు చేపడుతున్నారు. అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ గోల్డీ బ్రార్‌పై కఠిన చర్యలకు సిద్ధమైంది. సతీందర్‌జీత్ సింగ్ అలియాస్ గోల్డీ బ్రార్ అరెస్టుకు అవసరమైన సమాచారం అందించిన వారికి 50,000 డాలర్ల (సుమారు రూ. 43 లక్షలు) బహుమతిని అందజేస్తామని ప్రకటించింది. లారెన్స్ బిష్ణోయ్‌పై హత్య, హత్యాయత్నం, దోపిడీ, బెదిరింపులు వంటి అనేక కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం అతను జైల్లోనే ఉన్నప్పటికీ అక్కడి నుంచే తన నేర సామ్రాజ్యాన్ని నడిపిస్తున్నట్లు సమాచారం. అతడి గ్యాంగ్‌లో పెద్ద సంఖ్యలో షూటర్లు ఉన్నారు.

# ఇరాన్‌కు 24 గంటలు గడువు ఇస్తున్నాం..

**-హర్మూజ్ అంశంలో అమెరికా వార్నింగ్..!**



**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
హర్మూజ్ జలసంధి లో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయాలని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ ను అమెరికా హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. హర్మూజ్ జలసంధి అంతర్జాతీయ నౌకాయానానికి పూర్తిగా తెరిచి ఉంటుందని, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడులు జరగవని పేర్కొంటూ 24 గంటల్లోగా ఇరాన్ బహిరంగ ప్రకటన చేయాలని వాషింగ్టన్ స్పష్టం చేసినట్టు సమాచారం. గడువులోగా చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన సైనిక, ఆర్థిక చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరించినట్టు తెలుస్తోంది.ఈ హెచ్చరికను మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు అమెరికా చేరవేసినట్టు సమాచారం. 'నౌకలపై కాల్పులు ఆపేస్తామని బహిరంగంగా చెప్పాలి. అలాగే తాము తప్పు చేశామని వాళ్లు కనీసం పరోక్షంగానైనా అంగీకరించాలని మేము కోరుకుంటున్నాం. కాల్పులు ఆపేస్తామనేదే రేపు వారి ప్రకటన కావాలని, లేకపోతే వారికి అది మంచి రోజు కాబోదని అమెరికా అధికారి హెచ్చరించినట్టు తెలుస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఒమాన్‌లో మధ్యవర్తిత్వ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం ఇరాన్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అయితే గడువులోగా స్పష్టమైన హామీ రాకపోతే పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రష్యాకు మళ్లీ షాకిచ్చిన ఉక్రెయిన్..

**రష్యా చమురుశుద్ధి కర్మాగారంపై మెరుపు దాడి**



**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
రష్యాకు ఉక్రెయిన్ మరో షాకిచ్చింది. సమర రీజియన్లోని సిజ్రాన్ చమురు శుద్ధి కర్మాగారంపై కీవ్ డ్రోన్‌లు మెరుపు దాడి చేశాయి. దాంతో ఆయిల్ రిఫైనరీ కి భారీ నష్టం వాటిల్లింది. జూలై 11-12 మధ్యలో ఈ దాడులు చోటు చేసుకొన్నాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికారులు వెల్లడంచారు. ఈ రిఫైనరీ ఏటా 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును ప్రాసెస్ చేయగలదు.ఆ రిఫైనరీ నుంచి సమర రీజియన్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్ వెళ్తాయి. వాటిని రష్యా సైనిక దళాలు కూడా వినియోగిస్తాయి. దీనిని రోస్‌నెఫ్ట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. తాజా దాడితో ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేశారు. గతంలో ఈ రిఫైనరీని లక్ష్యంగా చేసుకొని ఏప్రిల్ 18, మే 11వ తేదీల్లో ఉక్రెయిన్ దాడులు చేసింది. ఉక్రెయిన్ ఇక్కడితో ఆగకుండా అజోవ్ సముద్రంలో 10 ట్యాంకర్లు, నాలుగు ఫెర్రీలను కూడా ధ్వంసం చేసింది. అంతర్జాతీయ ఆంక్షలను తప్పించుకుంటూ ఈ ట్యాంకర్లు రష్యా చమురును విక్రయిస్తుంటాయి. ఇక ధ్వంసమైన ఫెర్రీలు రష్యా సేనలకు లాజిస్టిక్స్ అవసరాలు, కార్గో తరలింపునకు వినియోగిస్తున్నారు. జూలై 11న భారీగా లూబ్రికెంట్ ఆయిల్ తరలిస్తున్న ఓ రైలును టోక్‌మాక్ వద్ద ఉక్రెయిన్ దళాలు ధ్వంసం చేశాయి. దాంతోపాటు పెద్ద ఎత్తున చమురు ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ఉక్రెయిన్ రక్షణ దళాలు ప్రకటించుకొన్నాయి.

# ఇక ప్రయివేటు క్షిపణులు

- -కేంద్రంలోని మోడీ సర్కారు పన్నాగాలు
- -తొలి దశలో అస్త్ర మార్క్-2 క్షిపణులు!
- -ఉత్పత్తి లక్ష్యాల భారం పేరిట బీడీఎల్ నిర్వీర్యం
- -రక్షణ ఉత్పత్తుల డిమాండ్ పెరగడంతో కొత్త వ్యూహమంటూ అడ్డదారి
- -బరిలో ఐకామ్, అదానీ, ఫోర్జ్, టాటా, మహీంద్రా
- -ముమ్మాటికీ దేశభద్రతకు ముప్పే : రక్షణశాఖ మాజీ సైన్యాధిపతులు




**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
కేంద్రంలోని మోడీ సర్కారు దేశంలోని ప్రభుత్వరంగ సంస్థల్ని విక్రయిస్తుంటే..ఇపుడు కీలకమైన రక్షణ శాఖను కూడా హోల్ సేల్ గా ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టే దిశగా పావులు కదుపుతోంది. దేశ భద్రతలో కీలకమైన క్షిపణుల తయారీని కూడా కార్పొరేట్ల గుప్పెట్లోకి తీసుకెళ్లేలా కేంద్రంలోని మోడీ సర్కారు యోచిస్తోంది. ఇందులో భాగంగా దేశ రక్షణ రంగంలో మరో కీలక సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్టు సమాచారం. ఇప్పటివరకు ప్రభుత్వ రంగ సంస్థలకే పరిమితమైన క్షిపణుల తయారీలో ఇకపై ప్రయివేటు సంస్థలకు కూడా అవకాశం కల్పించేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా భారత రక్షణ ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్, దేశ సాయుధ బలగాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఈ చర్యతో స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యం పెరగడంతో పాటు రక్షణ ఎగుమతులు కూడా మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికారుల వాదన. ?ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం.. రక్షణ రంగంలో ప్రయివేటు భాగస్వామ్యాన్ని క్రమంగా పెంచుతూవస్తోంది. యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకాదళా నికి అవసరమైన పరికరాల తయారీలో ప్రయివేటు సంస్థలకు తలుపులు తెరిచింది. ఇప్పుడు అత్యంత వ్యూహాత్మకంగా భావించే క్షిపణుల తయారీలోనూ ప్రయివేటు రంగాన్ని భాగస్వామ్యం చేయాలని కేంద్రం ప్రయత్నించడం దేశ భద్రతకు అంత ఆరోగ్యకరం కాదని రక్షణ రంగ నిపుణులు వాపోతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)ను నిర్వర్యం చేసే ఇలాంటి ప్రయత్నాలను కేంద్రం విరమించుకోవాలని సూచిస్తున్నారు.


**డిమాండ్ పేరుతో బుకాయింపు**

ప్రస్తుతం భారత సాయుధ బలగాలతో పాటు మిత్రదేశాల నుంచి కూడా స్వదేశీ రక్షణ ఉత్పత్తులకు భారీ స్థాయిలో డిమాండ్ పెరుగుతోంది. అయితే ఆ అవసరాలన్నింటినీ ఒక్క బీడీఎల్ మాత్రమే తీర్చడం కష్టంగా మారుతోందని కేంద్రం సాకులు చెబుతోంది. బీడీఎల్‌కు తగిన బడ్జెట్ కేటాయింపులు, నియామకాలు చేస్తే ఉత్పత్తి లక్ష్యాలు అందుకోవడం పెద్ద కష్టమేమీ కాబోదని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు. అంతేకాని దీనిని సాకుగా చూపి క్షిపణి తయారీ వంటి కీలక విభాగాలను ప్రయివేటు రంగ సంస్థలకు కట్టబెట్టేస్తే అవి లాభాల వేటలో దేశ భద్రతను సైతం పణంగా పెట్టే దుస్థితి వచ్చే ప్రమాదముందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ ప్రణాళికలో భాగంగా మొదటి దశలో గగనతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే అస్త్ర మార్క్-2 క్షిపణుల తయారీకి ప్రయివేటు సంస్థలను ఆహ్వానించనున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో ఐకామ్, అదానీ గ్రూప్, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలు పాల్గొనే అవకాశం ఉందని సమాచారం.

# 30 సెకండ్లలో 195 ముద్దులు.. బ్రెజిల్ జంట గిన్నిస్ రికార్డ్

**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
ఓ బ్రెజిల్ జంట తమ ప్రేమను గిన్నిస్ రికార్డ్ సాధనకు వేదికగా మలచుకొంది. రెనటో అల్వెస్, అతడి ప్రియురాలు నైరా రాబెర్టా 30 సెకండ్లలో 195 ముద్దులు పెట్టుకొని అర నిమిషంలో అత్యధిక ముద్దులు పెట్టుకొన్న జంటగా నిలిచింది. అంతర్జాతీయ ముద్దుల దినోత్సవం జరుపుకొనే జూలై 6 తర్వాత కొంత కాలానికే ఈ ఘనతను ఈ జంట సాధించింది. 'ప్రపంచంలోనే అత్యుత్తమ జంట'గా తమను నమ్ముతూ, తమది దృఢమైన బంధంగా భావించిన వీరిద్దరూ ఈ ప్రయత్నాన్ని సవాల్‌గా తీసుకొన్నారు. ఒక నిమిషంలో ఎక్కువ ముద్దులు పెట్టుకొన్న జంటగా నిలవడంపై ఈ జంట ఇప్పుడు దృష్టి సారించింది.





## అమర్‌నాథ్ యాత్రికుల బస్సు బోల్తా..

**-16 మందికి గాయాలు**




**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
అమర్‌నాథ్ యాత్రికుల తో వెళ్తున్న బస్సు బోల్తా పడటంతో 16 మంది గాయాలపాలయ్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా లో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోందిజమ్మూ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై బోల్తా పడినట్లు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు.

## త్వరలో ప్రజల ముందుకు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ..!




**న్యూఢిల్లీ -జూలై 12 (మహప్రభ)**
ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ త్వరలో ప్రజల ముందుకు రానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. జూలై 23న టెహ్రాన్‌లో ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను మొజ్తబా నిర్వహించనున్నారని సమాచారం. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్యలో నిర్వహించే ఈ కార్యక్రమంలో దేశంలోని కీలక నేతలందరూ పాల్గొంటారని వారు తెలిపారు.సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించలేదు. భద్రత దృష్ట్యా ఇటీవల నిర్వహించిన తండ్రి అంత్యక్రియలకు కూడా దూరంగా ఉన్నారు. రెండు వారాల కిందట తన సతీమణి అంత్యక్రియల్లోనూ మొజ్తబా కనిపించలేదు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వీరిలో ఒకరు ఫిబ్రవరి 28 నాటి దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఆ దాడుల్లో తీవ్రంగా గాయపడిన మొజ్తబా చికిత్స తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే నాటి నుంచి కూడా ఇరాన్‌పై దాడులను సోషల్ మీడియా వేదికగా మొజ్తాబా ఖండిస్తూ వస్తున్నారు. శనివారం కూడా సోషల్ మీడియా మొజ్తాబా ఒక పోస్ట్ పెట్టారు. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రతిజ్ఞ చేశారు.

## వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడి.. బావిలో పడేసిన వ్యక్తి



**తిరువనంతపురం -జూలై 12 (మహప్రభ)**
ఒక వ్యక్తి వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మరణించినట్లు భావించాడు. ఆ మహిళను బావిలో పడేశాడు. మద్యం మత్తులో ఈ విషయాన్ని స్నేహితుడికి అతడు చెప్పడంతో పోలీసులకు తెలిసి అరెస్ట్ చేశారు. కేరళలోని త్రిసూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సురేష్ అనే వ్యక్తి రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. పెరుంబవూర్ రైల్వే పట్టాల సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో ఉన్న అద్దె ఇంట్లో అతడు నివసిస్తున్నాడు.కాగా, కొన్ని రోజుల కిందట 65 ఏళ్ల వృద్ధురాలిని సురేష్ తన ఇంటికి తీసుకువచ్చాడు. వారిద్దరి మధ్య గొడవ జరుగడంతో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయిందని భావించాడు. సమీపంలోని ఒక బావిలో ఆమెను పడేశాడు. మరోవైపు శనివారం మద్యం సేవించిన సురేష్ ఆ మత్తులో ఈ విషయాన్ని తన స్నేహితుడికి చెప్పాడు. దీంతో పోలీసులకు ఇది తెలిసింది. ఈ నేపథ్యంలో సురేష్ ఇంటికి చేరుకుని సోదా చేశారు. ఇంట్లో ఉన్న అతడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. సురేష్ సమాచారం ఆధారంగా అగ్నిమాపక సిబ్బందితో కలిసి వృద్ధురాలి మృతదేహాన్ని బావి నుంచి పోలీసులు వెలికితీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు సురేష్‌ను అరెస్ట్ చేసి అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. సురేష్ స్నేహితులను కూడా విచారిస్తున్నట్లు వెల్లడించారు.

## అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో ఎన్నికలు



**జెరూసలెం, - జూలై 12 (మహప్రభ)**
ఓ వైపు యుద్ధాలు చేస్తూ.. మరోవైపు ఓటర్లను ఎదుర్కొనేందుకు నెతన్యాహు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. ఇజ్రాయెల్‌లో తదుపరి సార్వత్రిక ఎన్నికలు అక్టోబర్ 27న జరుగుతాయని అధికార 'లికుడ్' పార్టీ కీలక సభ్యుడు ఒఫిర్ కట్జ్ ఆదివారం ప్రకటించారు. ఆ దేశంలో 1988 తర్వాత నిర్ణీత సమయంలో జరుగుతున్న ఎన్నికలు ఇవే కావటం గమనార్హం.అంతేగాక గత 50 ఏండ్లలో నాలుగేండ్లు పాలించిన సర్కార్‌గా నెతన్యాహు ప్రభుత్వం నిలిచింది. 120 మంది సభ్యులున్న పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే ఒక పార్టీకి 61 సీట్లు అవసరం. గత బుధవారం చానల్ 13 ప్రచురించిన పోల్ ప్రకారం, ఈసారి నెతన్యాహు నేతృత్వంలోని సంకీర్ణ కూటమికి ఓటమి ఖాయమని అంచనావేసింది.

# కాంగ్రెస్ ద్రోహం చేసింది

మొదటి తరువాయి

తోల్ తిరుమావళవన్ ప్రతిపాదించడంపై డీఎంకే వ్యాఖ్యానిస్తూ, ఆ రాష్ట్రాల మోడల్ తమిళనాడులో నడవదని చెప్పింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్, ఎన్నికల తర్వాత విజయ్‌తో చేతులు కలిపింది. తమను కాంగ్రెస్ ద్రోహం చేసిందని డీఎంకే ఆరోపిస్తూ.. రాష్ట్రంలో మారిన పరిస్థితుల్లో టీవీకేతో చేతులు కలిపే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. డీఎంకే ఎంపీ గణపతి పి. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల తర్వాత కేవలం మంత్రి పదవుల కోసం టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలిపి, డీఎంకేకు వెన్నుపోటు పొడిచిందని అన్నారు. ఇప్పుడు డీఎంకేను ఒప్పించడానికి వీసీకేని పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్‌పై ఆరోపించారు. పార్లమెంట్లో ఒక్కసీటు కూడా లేని టీవీకేను కూటమిలో చేర్చాలా.? అనే దానిపై సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. మరోవైపు, కాంగ్రెస్ ఎంపీ జ్యోతిమణి మాత్రం బీజేపీని ఎదుర్కోవడానికి విస్తృత ప్రతిపక్ష ఐక్యత అవసరమని అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాల కోసం రాజకీయ విభేదాలను పక్కన పెట్టాలని సూచించారు. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ స్పందిస్తూ.. ముందుగా విజయ్‌ను ఒప్పించండి, ఆయన డీఎంకేనూ తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా చెబుతున్నారని, అలాంటప్పుడు ఎలా కలిసి పనిచేస్తారు.? అని ప్రశ్నించారు.

# స్పామ్ కాల్స్ ఫియర్!

మొదటి తరువాయి

ప్రభుత్వ శాఖలు ప్రజలకు సేవలు, లావాదేవీలు, అధికారిక సమాచారాన్ని అందించేందుకు వాడే 1600 సిరీస్ ఫోన్ కాల్స్‌ను ఏ కాలర్ ఐడీ యాప్ కూడా బ్లాక్ చేయలేరని, ట్యాగ్ చేయడం లేదా ఫిల్టర్ చేయడం కుదరదని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) స్పష్టం చేసింది. ట్రూకాలర్‌తో వివాదం నేపథ్యంలో ట్రాయ్ ఈ క్లారిటీ ఇచ్చింది. టెలికాం కమర్షియల్ కమ్యూనికేషన్స్ కస్టమర్ ప్రిఫరెన్స్ రెగ్యులేషన్స్ ప్రకారం.. 1600 సిరీస్ నంబర్లే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కంపెనీలు, ప్రభుత్వ విభాగాలు వంటి నియంత్రిత సంస్థలకు కేటాయించారు. ఈ సిరీస్ నంబర్ల ద్వారా వినియోగదారులకు లావాదేవీలు, సేవలకు సంబంధించిన కీలక సమాచారం అందిస్తారని తెలిపింది. అదేవిధంగా, 140 సిరీస్ నంబర్ల నుంచి వచ్చే ప్రమోషనల్ కాల్స్‌ను కూడా యాప్‌లు నేరుగా బ్లాక్ చేయలేవని ట్రాయ్ వెల్లడించింది. అయితే, ఈ కాల్స్‌ను రాకుండా ఆపాలంటే మాత్రం వినియోగదారులు తమ మొబైల్ నంబర్‌ను డూ నాట్ డిస్టర్బ్ రిజిస్టర్‌లో రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా సూచించింది. అప్పుడు మాత్రమే ఈ సిరీస్ నంబర్లను కూడా టెలికాం ఆపరేటర్ల ద్వారా బ్లాక్ చేయొచ్చని సూచించింది.

వినియోగదారులు అలర్ట్‌గా ఉండాలని..

మరోవైపు.. ట్రూకాలర్ సీఈఓ రిషిత్ ఝున్‌ఝున్‌వాలా మాత్రం 140, 1600 సిరీస్ నంబర్ల నుంచే పెద్దఎత్తున స్పామ్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. ప్రతిరోజూ ఈ రెండు సిరీస్‌ల నుంచి వచ్చే 5.1 కోట్లకు పైగా కాల్స్ వస్తున్నా వినియోగదారులు కాల్స్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పారు. ముఖ్యంగా 1600 సిరీస్ కాల్స్‌ను బ్లాక్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. తద్వారా అధికారిక కాల్స్, స్పామ్ కాల్స్ మధ్య తేడాను గుర్తించి వినియోగదారులు అలర్ట్‌గా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. 2025 అక్టోబర్ నుంచి 208 శాతం బ్లాక్ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# హెర్మూజ్ మళ్లీ మూసివేత..

- ప్రకటించిన ఇరాన్.. అదేం లేదన్న అమెరికా
- జలసంధిపై ఇరుదేశాల మధ్య భిన్న వాదనలు
- చమురు, ఎల్పీజీ దిగుమతులపై భారత్‌కు ఆందోళన
- కొనసాగితే ముందుగా గ్యాస్ కొరతే!
- బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ ఎగబాకిన వైనం
- గల్ఫ్‌లో భారతీయుల భద్రతపై కేంద్రం అప్రమత్తం
- పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన మార్కెట్లలో ఉత్కంఠ

టెహ్రాన్

నౌకాయానానికి వీలు లేకుండా హెర్మూజ్ జలసంధిని మూసివేసినట్టు ఇరాన్ మరోసారి ప్రకటించింది. గల్ఫ్‌లో అమెరికా తన చట్టవిరుద్ధ కదలికలను కొనసాగిస్తూనే ఉందని ఆరోపించింది. కాగా, ఇరాన్ ప్రకటనకు విరుద్ధంగా ఈ వ్యూహాత్మక జలమార్గం తెరిచే ఉన్నట్టు అమెరికా ప్రకటించింది. ఇరాన్‌కు దానిపై ఎలాంటి నియంత్రణ లేదని, ఈ మార్గంలో నౌకల వాణిజ్య రవాణా యథా ప్రకారం కొనసాగుతున్నదని స్పష్టం చేసింది. కాగా, ఈ ప్రాంతంలో అమెరికా వైఖరి కారణంగా ఈ జలసంధి మీదుగా ఎలాంటి నౌకల రాకపోకలను అనుమతించబోమని టెహ్రాన్‌కు చెందిన పర్షియన్ గల్ఫ్ స్ట్రెయిట్ అథారిటీ (పీజీఎస్‌ఏ) ఒక ప్రకటనలో పేర్కొంది.



అయితే హెర్మూజ్ జలసంధి మూసివేసినట్టు ఇరాన్ చేసిన ప్రకటనను అగ్రరాజ్యం తోసిపుచ్చుతూ ఈ జలమార్గంలో నౌకాయానం యథావిధిగా జరుగుతున్నదని ప్రకటించింది. ఇదే విషయాన్ని ఆదివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా నిర్ధారించారు. ఈ మార్గంలో వాణిజ్య నౌకల రవాణాకు ఎలాంటి ఆటంకం లేదని పేర్కొన్నారు.

భారత్‌లో మళ్లీ ఎల్పీజీ సంక్షోభం?

హెర్మూజ్ జలసంధిని మూసివేయడం, పశ్చిమాసియాలో తిరిగి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటం చూస్తుంటే భారత్‌లో మరోసారి చమురు, ఎల్పీజీ సంక్షోభం తప్పదని అనిపిస్తున్నది. భారత్‌కు అధిక మొత్తంలో చమురు, ఎల్పీజీ హెర్మూజ్ జలసంధి మీదుగానే దిగుమతి అవుతుండటంతో మరోసారి చిక్కులు తప్పేట్టు లేవు.

మొదటిగా వచ్చేది గ్యాస్ కొరతే

హెర్మూజ్ మూసివేత కనుక కొనసాగితే మొట్టమొదట మన దేశంలో ఏర్పడేది గ్యాస్ కొరతే. జూలై 9 తర్వాత అమెరికా తాజా దాడుల కారణంగా బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 79 డాలర్లకు ఎగబాకింది. అలాగే గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత కూడా ప్రభుత్వానికి ఆందోళనకరంగా మారింది. యూఏఈ, ఖతార్, కువైట్, బహ్రెయిన్‌ల్లో సుమారు కోటి మందికి పైగా భారతీయులు నివసిస్తున్నారు.

## పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే మేడిగడ్డపై కుట్ర

-గురువు చంద్రబాబుకు రేవంత్ రెడ్డి గురుదక్షిణ
-ఇగో పక్కన పెట్టి తెలంగాణ రైతులను ఆదుకోండి
-ఎన్టీపీసీతో పాటు హైదరాబాద్‌కు తాగునీటి కష్టాలు తప్పవు
- మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

హైదరాబాద్



పట్టిసీమకు నీళ్లు వదిలేందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత రెండేండ్లుగా మేడిగడ్డకు మరమ్మత్తు చేయకుండా తాత్సారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటార్లు బంద్ పెట్టి, నీళ్లను కిందకు వదిలేస్తూ ఆంధ్రా ఆయకట్టుకు మేలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎల్‌నినో కరువు పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కా ముఖ్యమని నిపుణులు చెబుతున్న మాటలను సీఎం ఖాతరు చేయడం లేదన్నారు. ప్రస్తుతం గోదావరిలో పారుతున్న 50 వేల క్యూసెక్కుల వరదను కన్నెపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. దేవాదులలో 10 మోటార్లు ఉంటే 4 మాత్రమే నడుపుతూ.. 2,500 క్యూసెక్కులు ఎత్తాల్సిన చోట కేవలం 1,200 క్యూసెక్కులు మాత్రమే ఎత్తుతున్నారని ఆరోపించారు. ఫలితంగా వరంగల్, ధర్మసాగర్, పాలకుర్తిల్లో 75 శాతం చెరువులు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొన్నటి వరకు గోదావరిలో నీళ్లే లేవని అబద్ధం చెప్పిన సీఎం... పారుతున్న గోదావరిని లైవ్ లో చూపించగానే మాటమార్చి కొత్త పల్లవి ఎత్తుకున్నారని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి మోటార్లు ఎలా నడుపుతారంటూ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. 2028లో 28 లక్ష లు, 2025లో 15లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా భద్రాచలానికి ఎలాంటి ముప్పు జరగలేదని గుర్తు చేశారు. అన్నారం, సుందిళ్ల రెండు బ్యారేజీల్లో మొత్తం 8 టీఎంసీలంటే దాదాపు 80 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే నిల్వ ఉంటుందని చెప్పారు. ఇదే విషయాన్ని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్లు చెబితే సీఎం జీర్ణించుకోలేక పోతున్నారని విమర్శించారు. నిన్నటి దాకా నిపుణుల కమిటీ, రిటైర్డ్ ఇంజినీర్లు అని చెప్పిన సీఎం.. ఇప్పుడు నీళ్లు ఎత్తమని టెక్నికల్ సూచన చేయగానే వారిని జైల్లో పెడతామని బెదిరిస్తున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నామినేటెడ్ దక్కేదెవరికి?

మొదటి తరువాయి



ఒక్కో పదవికి 10 మంది పోటీ..

ఈ నెల 8న 37 మంది నామినేటెడ్ చైర్మన్ల రెండేళ్ల పదవి కాలం ముగిసింది. ఈ పదవులను దక్కించుకునేందుకు తాజా మాజీ చైర్మన్లు, అసలే పదవులు దక్కని లీడర్లు సైతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పదవి ఉంటే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ సౌకర్యం లభిస్తుంది. మంత్రులు, అధికారుల వద్దకు ఈజీగా వెళ్లే అవకాశం ఉంటుంది. వీటికే తోడు ప్రభుత్వం కల్పించే వెహికల్, గన్ మెన్ సౌకర్యంతో రాజకీయంగా పరపతి పెరుగుతుంది. రాజకీయాల్లో మరింత ఎత్తుకు ఎదిగేందుకు వెసులుబాటు కలుగుతుంది. అందుకని చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే తపనలో లీడర్లు ఉన్నారు. దీంతో ఒక్కో పదవికి సుమారు 10 మంది వరకు పోటీ పడుతున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది.

పెద్ద ఎత్తున లాబీయింగ్

చైర్మన్ పదవులను దక్కించుకోవాలని టార్గెట్ గా పెట్టుకున్న మిగతా 07లో.. లీడర్లు పెద్ద ఎత్తున పైరవీలు చేస్తున్నారు. ముందుగా జిల్లాకు చెందిన మంత్రుల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. ఆ తరువాత జిల్లా ఇన్చార్జిల మనసు గెలుచుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఈ రెండు చోట్ల లైసెన్ క్లియర్ అయిన వెంటనే ప్రభుత్వంలోని కీలక నేతల ఆశీస్సుల కోసం లాబీయింగ్ చేస్తున్నారు. కొందరు నేరుగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కొందరైతే ఏకంగా ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు తెలిసింది. పార్టీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీలోని కీలక నేతలు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ వద్దకు వెళ్లి పదవి ఇప్పించాలని ప్రాధేయపడుతున్నట్టు తెలిసింది.

మరో ఛాన్స్ కోసం..

తాజా మాజీ చైర్మన్లు అందరూ మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో కొందరికి మాత్రమే రెన్యువల్ చేసే అవకాశం ఉంది. చైర్మన్ హోదాలో సదరు నాయకుడు పనితీరు ఆధారంగా మరోసారి అవకాశం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్టు తెలిసింది. అదే సంస్థకు చైర్మన్ పదవి ఇవ్వాలా? లేక మరో సంస్థ బాధ్యతలు అప్పగించాలా? అనే అంశంపై ఆరా తీస్తున్నట్టు సమాచారం. కొందరు పాత సంస్థలో మరోసారి పనిచేసేందుకు మొగ్గుచూపుతుండగా, మరికొందరు కొత్త సంస్థలో పనిచేసేందుకు చొరవ చూపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఎమ్మెల్యేలకు సైతం పదవులు

ఈసారి నామినేటెడ్ పదవుల భర్తీలో ఎమ్మెల్యేలు సైతం జాబితాలో ఉండే అవకాశం ఉంది. ప్రధానంగా ఆర్టీసీ, సివిల్ సప్లై కార్పొరేషన్ లాంటి కీలక సంస్థల చైర్మన్ పదవులు ఇచ్చే ఛాన్స్ ఉందని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు. గతంలో సివిల్ సప్లై కార్పొరేషన్ పదవిని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ కు కేటాయించారు. కానీ ఆయన ఆ పదవిని తీసుకునేందుకు ఆసక్తి చూపలేదు. మంత్రి పదవి కోసం ఆశలుపెట్టుకున్న ఎమ్మెల్యేలకు కీలకమైన సంస్థలకు చైర్మన్లుగా నియమించే ఛాన్స్ ఉంది. "ఈసారి పెద్ద మొత్తంలో నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుంది. చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను సైతం ప్రకటించవచ్చు" అని ఓ సీనియర్ మంత్రి వెల్లడించారు.

## నేపాల్‌లో మళ్లీ జెన్‌జీ
# ఉద్యమం..

మొదటి తరువాయి

నెలకొల్పడంలో ప్రభుత్వం విఫలమైందని విపక్ష నేపాలీ కాంగ్రెస్ ఆరోపించింది. యువత ఆత్మాహుతి చేసుకోవడాన్ని ప్రభుత్వ వైఫల్యంగా 2023లో బాలెన్ షా అభివర్ణించారు. తాజా నిరసనల సందర్భంగా నాడు ఆయన అన్న ఆ మాటలపై ప్రజలు చర్చించుకొంటున్నారు.



తాజా ఆందోళనలపై ఆయన మౌనం వహించడాన్ని విపక్షాలు విమర్శిస్తున్నాయి. యువత మానసిక ఆరోగ్యం క్షీణించడం, నిరుద్యోగం పెరుగడం, ప్రభుత్వ విధానాల ప్రభావంపై తాజా నిరసనలు మళ్లీ ఆందోళనను రేకెత్తించాయి. యువత సమస్యలపై ప్రభుత్వం అర్థవంతమైన చర్యలు తీసుకోకపోతే నిరసనల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నదని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు హెచ్చరించాయి.

## నేడు పోలవరంకు
# సీఎం చంద్రబాబు


మొదటి తరువాయి

అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ వై. ప్రసాద్ రావు, ఇంటెలిజెన్స్, సెక్యూరిటీ వింగ్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన భద్రత ఏర్పాట్లను వారు క్షుణ్ణంగా సమీక్షించారు. అడుగడుగునా అప్రమత్తంగా ఉండాలని అధికారులను సూచించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులు సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, సభా ప్రాంగణం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ ఏర్పాట్లపై పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏపీ భద్రతతో పాటు, సాధారణ ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. అత్యవసర సేవల లభ్యతపై సమావేశంలో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి వివిధ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పూర్తి భద్రత, సురక్షితంగా పర్యటనలు చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఇందుకోసం అన్ని శాఖల అధికారులు అంకితభావంతో, పరస్పర సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులకు అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ కీలక సమావేశంలో రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో పాటు పోలవరం ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్షాలు

- వచ్చే 3 రోజులు వానలే వానలు
- హెచ్చరించిన వాతావరణ శాఖ

హైదరాబాద్




తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం భిన్న వాతావరణం నెలకొంది. ఆంధ్రప్రదేశ్, యానాం పరిసర ప్రాంతాలలో దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశల నుండి వేడి గాలులు వీస్తుండటంతో ఏపీలో ఎండల తీవ్రత పెరగనుంది. మరోవైపు తెలంగాణలో రుతుపవన ద్రోణి ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ -- యానాం

ఆదివారం ఈ ప్రాంతంలో వాతావరణం కాస్త మిశ్రమంగా ఉంటుంది. ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు కురిసే ఛాన్స్ ఉంది. అయితే ఇదే సమయంలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈక గాలులు వీస్తాయి. ఒకటి లేదా రెండు చోట్ల తీవ్రమైన వడగాలులు వీచే ప్రమాదం ఉంది. సోమ, మంగళవారాల్లో వర్షాలు తగ్గి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడుతుంది. ఎండల తీవ్రత పెరగడంతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు, ఒకటి లేదా రెండు చోట్ల వడగాలులు వీచే అవకాశం ఉంది.

దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్

ఈ ప్రాంతంలో రాబోయే మూడు రోజుల పాటు పూర్తిగా పొడి వాతావరణమే ఉంటుంది. ఎండలు మండిపోనున్నాయి. ఈరోజు గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో రేపు, ఎల్లుండి గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయి. తీర ప్రాంత వాసులు వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

రాయలసీమ

రాయలసీమ వ్యాప్తంగా ఎలాంటి వర్ష సూచన లేదు. పూర్తిగా పొడి వాతావరణం ఉంటుంది. అయితే ఉపరితల గాలులు బలంగా వీచనున్నాయి. ఈరోజు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో రాబోయే రెండు రోజులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

తెలంగాణ వాతావరణ సూచన

ప్రస్తుతం రుతుపవన ద్రోణి సగటు సముద్రమట్టం వద్ద శ్రీ గంగానగర్, హిస్సార్, మీరట్, గోరఖ్‌పూర్ మీదుగా దక్షిణ అస్సాం వరకు కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో రాబోయే మూడు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు లేదా చెదురుమదురు జల్లులు కురిసే అవకాశం ఉంది. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో ఉపరితల గాలులు అత్యంత బలంగా గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే ప్రమాదం ఉంది. మధ్య, దక్షిణ తెలంగాణ ఈ ప్రాంతాల్లో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయి.

# ఎల్నినోను ఎదుర్కొంటాం..

మొదటి తరువాయి

ప్రణాళిక, జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయగా ఈ నెల 15 నుంచి అమలు చేయాల్సిన ప్రణాళికపై సమీక్ష నిర్వహించనున్నారు.

30 నుంచి 40 లక్షల ఎకరాల్లో వరిసాగు ఈ ఖరీఫ్‌లో ఎల్నినో ప్రభావం కొనసాగితే వరి 30 నుంచి 40 లక్షల ఎకరాల్లో సాగు అయ్యే అవకాశాలు ఉన్నట్లు మంత్రి చెప్పారు.

అందుకనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల ఎకరాలకు 3 దశల్లో ప్రత్యామ్నాయ సాగు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. ఈ నెల 10 నాటికి రాష్ట్రంలోని 33 జిల్లాల వర్షపాతం పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, 13 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదకాగా, 20 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందన్నారు. లోటు జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సంయుక్తంగా పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో వర్షపాతం, సాగు పురోగతి, నేల తేమ, విత్తనాల లభ్యత, రైతుల అవసరాలపై రోజువారీ నివేదికలను విశ్లేషిస్తూ, అవసరమైన చోట వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ అమలు చేస్తున్నామని వెల్లడించారు.

# కన్నీటి వీడ్కోలు

మొదటి తరువాయి

అధికారిక లాంఛనాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. జానకి కుమారుడు మురళీకృష్ణ ఈ ఏడాది జనవరిలోనే మరణించడంతో ఆమె మనవరాలు అప్సర దహన సంస్కార కార్యక్రమాలు నిర్వహించారు. కనియనహుండి గ్రామంలోని జానకి అభిమాని నవీన్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ఈ అంత్యక్రియలు జరిగాయి.

భావోద్వేగానికి గురైన అభిమానులు

ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మహారాజా కాలేజ్ మైదానంలో సినీ ప్రముఖులు, సంగీత దర్శకులు, కళాకారులు, వేలాది మంది అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలుకుతూ నివాళులర్పించారు. అనంతరం అంతిమ సంస్కారాల కోసం ఆమె భౌతికకాయాన్ని హెచ్.డి. కోటె తాలూకాలోని కనియనహుండి తోటలోకి తరలించారు. అక్కడ కాసేపు అభిమానుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. మధ్యాహ్నం 3:05 గంటలకు అంతిమ యాత్ర ప్రారంభమైంది. ?ఆమె కుటుంబ సభ్యులు, పోలీసులు, అధికారులు వాహనాల్లో వెంట వెళ్లారు. తమ అభిమాన గాయనికి చివరిసారిగా అభిమానులు దారి పొడవునా నీరాజనం పట్టారు. పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు.

# పేరు మార్చుకోవాలంటే ఎలా?

-105 అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ జెండాలు ఎగరేశాం
- ఈసీకి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత రిప్లై

హైదరాబాద్



కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదించిన పేరును నమ్ముకుని సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకున్నామని.. ఇప్పుడు ఆ పేరును మార్చుకోవాలంటే తమకు తీరనష్టం కలుగుతుందని, అన్యాయం చేసినట్టువుతుందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన పార్టీకి గుర్తింపునివ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ నెల 7న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రిప్లై ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన ప్రధాన కార్యదర్శి హోదాలో అనిల్‌కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌తో పాటు ఎన్నికల కమిషనర్లకు లేఖ రాశారు. ఈసీ ఆమోదించిన అనేక పార్టీల పేర్లు ఒకేలా ఉన్నాయని.. ఒక్క తెలంగాణలోనే తెలంగాణ రాజ్యసమితి, తెలంగాణ రక్షణ సమితి పేర్లతో రెండు పార్టీలకు గుర్తింపునిచ్చారని తెలిపారు. వాటికి లేని అభ్యంతరాలు తెలంగాణ రక్షణ సేనపై ఎందుకని ప్రశ్నించారు. తమ పార్టీ రిజిస్ట్రేషన్‌ను వ్యతిరేకిస్తూ వచ్చిన వెయ్యి అభ్యంతరాలను తమకు పంపాలని కోరారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరును తమకు కేటాయిస్తూ ఏప్రిల్ 28న లేఖ ద్వారా సమాచారం ఇచ్చిందని తెలిపారు. దాంతో రాష్ట్రవ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించుకోవడంతో పాటు పార్టీ నిర్మాణపరమైన ఇతర కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. అభ్యంతరాలను తమకు పంపకపోతే తాము సమాధానం ఎలా చెప్పాలన్నారు.

## సంపాదకీయం

# కల్తీ కాటు... ప్రజారోగ్యానికి చేటు!



ఆహారం మనిషికి జీవనాధారం. అదే ఆహారం విషంగా మారితే సమాజానికి అంతకంటే పెద్ద ప్రమాదం మరొకటి ఉండదు. నేడు మార్కెట్‌లోకి వస్తున్న అనేక ఆహార పదార్థాలపై ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలు యాదృచ్ఛికం కావు. పాలు, నెయ్యి, వంటనూనెలు, కారం, పసుపు, మసాలా దినుసులు, స్వీట్లు, తేనె, ప్యాకెట్ ఆహార పదార్థాలు, పానీయాలు... ఇలా రోజూ మన ఇంటి వంటగదిలోకి చేరే ప్రతి వస్తువూ ఇప్పుడు నాణ్యత పరీక్షకు నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది కేవలం కల్తీ వ్యాపారం కాదు. ఇది ప్రజల ఆరోగ్యంపై జరుగు తున్న ఒక నిశ్శబ్ద యుద్ధం. నెమ్మదిగా శరీరాన్ని దెబ్బతీసే విషపూరిత వ్యాపారం. లాభాల కోసం మనుషుల ప్రాణాలను పణంగా పెట్టే అమానవీయ ధోరణి. కల్తీ అనేది ఒక వ్యక్తి చేసే చిన్న నేరం కాదు. దీనివెనుక ముడి పదార్థాల సరఫరాదారులు, అక్రమ తయారీ కేంద్రాలు, నకిలీ ప్యాకింగ్ యూనిట్లు, మధ్యవర్తులు, పంపిణీదారులు, కొంతమంది వ్యాపారులు కలిసి పనిచేసే భారీ నెట్‌వర్క్ ఉంటుంది. ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ లేబుళ్లు ముద్రించడం, నాసిరకం పదార్థాలను కలిపి అసలైన ఉత్పత్తుల్లా విక్రయించడం, గడువు ముగిసిన వస్తువులకు కొత్త తేదీలు ముద్రించడం వంటి మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇవి ఒక్కరోజులో పుట్టిన సమస్యలు కావు, సంవత్సరాలుగా పర్యవేక్షణలో ఏర్పడిన బలహీనతల ఫలితమే.ప్రతి పండుగ సీజన్‌లో, లేదా ఏదైనా ఘటన జరిగినప్పుడు అధికారులు దాడులు నిర్వహించి టన్నుల కొద్దీ కల్తీ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. అయితే అసలు ప్రశ్న వేరే ఉంది. ఈ వస్తువులు మార్కెట్‌లోకి వచ్చేంత వరకు తనిఖీ వ్యవస్థ ఏమి చేస్తోంది? అక్రమ తయారీ కేంద్రాలు నెలల తరబడి ఎలా కొనసాగుతు న్నాయి?ప్రతి దాడి తర్వాత మళ్లీ అదే తరహా కల్తీ బయటపడుతుంటే, దాడులు సమస్యకు పరిష్కా రమా? లేక కేవలం ప్రచార చర్యలుగానే మిగిలిపో తున్నాయా? కల్తీని అరికట్టాలంటే చిన్నచిన్న దుకాణాలపై చర్యలు తీసుకోవడం సరిపోదు. మూలాలను ఛేదించే దిశగా దర్యాప్తు సాగాలి. అక్రమ సరఫరా గొలుసును పూర్తిగా విచ్ఛిన్నం చేయాలి. కల్తీ ఆహారం వల్ల వచ్చే నష్టం వెంటనే కనిపించకపోవచ్చు. కానీ అది శరీరాన్ని లోపల నుంచి నెమ్మదిగా దెబ్బతీస్తుంది. కాలేయం, మూత్రపిండాలు, గుండె, జీర్ణవ్యవస్థ వంటి కీలక అవయవాలపై తీవ్ర ప్రభావం చూపు తుంది. క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు కూడా దారి తీసే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారిపై దీని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. అందుకే కల్తీని సాధారణ ఆర్థిక నేరంగా కాకుండా, ప్రజల ప్రాణాలపై జరిగే దాడిగా పరిగణించే సమయం ఆసన్నమైంది. ఆహార భద్రతకు సంబంధించిన చట్టాలు దేశంలో కొదవలేదు. కానీ వాటి అమలులోనే సమస్య ఉంది. నమూనాల సేకరణ, ప్రయోగశాల పరీక్షలు, కేసుల విచారణ, శిక్షల అమలు వంటి ప్రక్రియలు నెలల తరబడి, కొన్నిసార్లు ఏండ్ల పాటు సాగుతుండటంతో నేరస్థులకు భయం లేకుండా పోతోంది. కల్తీ కేసుల విచారణకు ప్రత్యేక వేగవంతమైన న్యాయవ్యవస్థ అవసరం. భారీ జరిమానాలతో పాటు పునరావృత నేరాలకు శాశ్వత లైసెన్స్ రద్దు, ఆస్తుల స్వాధీనం వంటి కఠిన చర్యలు అమలైతేనే పరిస్థితిలో మార్పు కనిపిస్తుంది. ప్రతి జిల్లాలో అత్యాధునిక ఆహార పరీక్షా ప్రయోగశాలలు ఏర్పాటు చేయాలి. వినియోగదారులు మొబైల్ ద్వారా ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించాలి. ప్రతి ఫిర్యాదుకు ప్రత్యేక ట్రాకింగ్ నంబర్ ఇచ్చి, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేయాలి. దాడుల వివరాలు, పరీక్షల ఫలితాలు, శిక్షలు, లైసెన్స్ రద్దు చేసిన సంస్థల జాబితా ప్రజలకు అందుబాటులో ఉంచితే పారదర్శకత పెరుగుతుంది. భయమే నేరస్థులకు మొదటి శిక్ష. అలాగే ప్రభుత్వం మాత్రమే కల్తీని అరికట్టలేదు. వినియోగదారుడే మొదటి నిఘా అధికారి. కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై తయారీ తేదీ, గడువు తేదీ, నాణ్యత గుర్తులు పరిశీలించాలి. బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమానాస్పద వస్తువులపై వెంటనే ఫిర్యాదు చేయాలి. సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని ప్రచారం కాకుండా అధికారులకు ఆధారాలతో సమాచారం అందించాలి. ప్రజల అప్రమత్తత పెరిగితేనే కల్తీ వ్యాపారుల మార్కెట్ కుంచించుకు పోతుంది. ప్రభుత్వాలు రోడ్లు వేయవచ్చు. భారీ భవనాలు నిర్మించవచ్చు. పెట్టుబడులు తీసుకురావచ్చు. పారిశ్రామిక అభివృద్ధి సాధించవచ్చు. కానీ ప్రజలు తినే ఆహారం సురక్షితంగా లేకపోతే ఆ అభివృద్ధికి అసలు అర్థమే ఉండదు. ఆహార భద్రత అనేది కేవలం ఆరోగ్య శాఖ బాధ్యత కాదు. అది పాలనకు ప్రమాణం. ప్రజల ప్రాణా లను కాపాడే అత్యంత ప్రాథమిక బాధ్యత. కల్తీపై పోరాటం ఒకరోజు దాడులతో ముగిసేది కాదు. అది నిరంతర పర్యవేక్షణ, కఠిన చట్టాల అమలు, పారదర్శక పరిపాలన, బాధ్యతాయుత వ్యాపారం, అప్రమత్తమైన ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంత మవుతుంది.

# నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు ద్రోహం చేస్తున్న నర్సారెడ్డి!

-"పార్టీ పదవులను డబ్బులకు అమ్ముకుంటూ కాంగ్రెస్ విలువలను కాలరాస్తున్నారు"

-"అధిష్టానాన్నే ధిక్కరించిన వారికి గుణపాఠం తప్పదు"

-కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్ రెడ్డి ఫైర్





**తూప్రాన్, జూలై 12 (మహా ప్రభ)**
తూప్రాన్ ఉమ్మడి మండల కాంగ్రెస్ రాజకీయాలు మరోసారి రగిలాయి. మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహిపాల్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీ కోసం దశాబ్దాలుగా కష్టపడుతున్న అసలైన కాంగ్రెస్ కార్యకర్తలను పక్కనబెట్టి, బీఆర్‌ఎస్ నుంచి వచ్చిన వలస నేతలకు లక్షల రూపాయలు తీసుకుని పదవులు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించిన కమిటీలను ధిక్కరిస్తూ ప్రత్యామ్నాయ కమిటీలు వేయడం కాంగ్రెస్ పార్టీపై తిరుగుబాటేనని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తూప్రాన్ అర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, "కాంగ్రెస్ జెండా మోసిన కార్యకర్తల కన్నీళ్ల మీద పదవుల వ్యాపారం చేయడం సిగ్గుచేటు. పార్టీని నమ్ముకున్న వారిని మోసం చేసి, డబ్బు ఇచ్చిన వారికి పదవులు పంచడం కాంగ్రెస్ సిద్ధాంతాలకు తూట్లు పొడవడమే" అని ధ్వజమెత్తారు. ఆయన మాట్లాడుతూ, "గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం ఆస్తులు అమ్ముకుని, కుటుంబాలను పక్కన పెట్టి రాత్రింబవళ్లు శ్రమించిన కార్యకర్తలకు అన్యాయం చేసి, నిన్న మొన్నటి వరకు బీఆర్‌ఎస్‌లో ఉన్న వారిని డబ్బుల కోసం కాంగ్రెస్ పదవుల్లో కూర్చోబెట్టడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీని అడ్డగోలుగా వాడుకుంటున్నారని ఆరోపించిన మహిపాల్ రెడ్డి, "పార్టీ అధిష్టానం ప్రకటించిన అధికారిక కమిటీలను బేఖాతరు చేస్తూ కొత్త కమిటీలు వేయడం అంటే పీసీసీ అధ్యక్షుడి నిర్ణయాన్నే సవాలు చేయడమే. పార్టీ క్రమశిక్షణను తుంగలో తొక్కే వారికి కాంగ్రెస్‌లో స్థానం ఉండదు" అని హెచ్చరించారు. ఇంకా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, "మనోహరాబాద్, తూప్రాన్ ప్రాంతాల్లో మీకు ప్రజల మద్దతు లేదని ఎన్నికల ఫలితాలే నిరూపించాయి. ఎమ్మెల్యేగా పోటీ చేసి కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని నాయకుడు ఇప్పుడు కార్యకర్తలకు నీతులు చెప్పడం విడ్డూరం" అని ఎద్దేవా చేశారు. తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కూడా నర్సారెడ్డే కారణమని ఆరోపించిన ఆయన, "మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నుంచి పార్టీ పదవుల వరకు అన్నింటినీ డబ్బుతో కొలిచే రాజకీయాలకు నర్సారెడ్డి ప్రతీకగా మారారు. కాంగ్రెస్ పార్టీని వ్యక్తిగత వ్యాపార కేంద్రంగా మార్చే ప్రయత్నాలను కార్యకర్తలు ఎప్పటికీ సహించరు" అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నిజమైన కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలతో చెలగాటం ఆడితే అధిష్టానం కఠిన చర్యలు తీసుకుంటుంది. పార్టీని అమ్ముకునే రాజకీయాలకు కాంగ్రెస్‌లో తావులేదు. కార్యకర్తలే కాంగ్రెస్‌కు వెన్నెముక... వారిని అవమానించిన వారికి రాజకీయంగా తగిన గుణపాఠం తప్పదు" అని మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. అనంతరం మనోహరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ నర్సారెడ్డి తీరును ఎండగట్టారు. అనంతరం తూప్రాన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగులపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం బాగా లేకున్న నర్సారెడ్డి కోసం పనిచేసిన తనను కించపరిచే విధంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే తూప్రాన్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిగే నర్సింగ్ రావు మాట్లాడుతూ నర్సారెడ్డి పార్టీ మారినప్పుడు తన వెంట టీఆర్‌ఎస్ లోకి రాకుండా కాంగ్రెస్ పార్టీ లో కొనసాగితే కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడు అని నర్సారెడ్డి పై విరుచుకపడ్డారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు మల్లారెడ్డి, చిట్కుల మహిపాల్ రెడ్డి, జుపల్లి మల్లారెడ్డి, నాగులపల్లి శ్రీనివాస్ రెడ్డి, బజారూ విశ్వరాజ్, గరిగే నర్సింగ్ రావు, లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ బుడ్డ భాగ్యరాజు, ఉమర్, అజార్, అనిల్ కుమార్, ఆకుల శ్రీరాములు, నవ్య నాగరాజు గౌడ్, పుట్ట వినోద మహన్, మరాఠీ నాగరాజ్, నాగరాజ్, కావేరి శ్రీనివాస్ రెడ్డి, చింతల జయరాములు, మున్సిపల్ అధ్యక్షులు గరిగే నరసింగ రావు, వెంగలి సత్యనారాయణ, సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, దోమలపల్లి కృష్ణ, జయరాములు, రాజా నరసింహ, రాము, నాగరాజుగౌడ్, మరాఠీ నాగరాజు, అబ్బురి బాలేష్, కొక్కొండ చంద్ర శేఖర్ రెడ్డి, లడ్డిపీర్ల శ్రీనివాస్ గౌడ్, పాముబండ నరేష్, మన్నె ధర్మేందర్, వై. నవీన్ యాదవ్, టి. వెంకట్ రెడ్డి, యు, ప్రవీణ్, మన్నె రాములు, వీణ. జావేద్ పాషా, శ్రీనివాస్ ముదిరాజు, వీణ. అఫ్సర్, కొక్కొండ శశి భూషణ్ రెడ్డి, చిట్టిమిళ్ళ అనిల్ కుమార్, వీణ అజహర్, ఉమర్ భాయ్, ఎన్. నవీన్ యాదవ్, పి. రంగేష్, జిన్నా కృష్ణ, గోపి రెడ్డి, పి. బల్ రాజ్, ఎండి. వహీద్, మన్నె తిరుపతి, టి. నాగరాజ్, డి. నరేష్, వెంకటేష్, బి. నవీన్ కుమార్, ఎం. రాము యాదవ్, S. కుమార్, బి. వినయ్ గౌడ్, దాసు, జె. శ్రీకాంత్, ముత్యాలు గౌడ్, కమ్మరి హరి కృష్ణ, ఆర్. రాజు గౌడ్, మెద్చల్ రామ స్వామి, కె.మహేష్, బి. పెంటయ్య, జక్కుల సత్య నారాయణ, డి. సత్యనారాయణ, వీణ ఎస్.కె. ఇర్ఫాన్, జి. నరేందర్ రెడ్డి, ఎ. నరసింహ చారి, టి. అశోక్, రాము, కె. రాజా నరసింహ, బి. వెంకటేష్, జె. శ్రీశైలం గౌడ్, సి. నందు ముదిరాజ్, ఎం. నాగరాజు, భాగ్యరాజ్, జె. శ్రీనివాస్, పి. భారత్, ఎం. గణేష్, గండ్ల వీరు, ఎస్. నాగభూషణ్, శ్యామ్ కుమార్, బి సురేష్, వర్గంటీ గౌతం గౌడ్, ఎ. సురష్, అరవింద్, S. వినయ్, కె. ఆనంద్, పి. కృష్ణ, ఎన్. గణేష్, నాగరాజ్, బాను, చందర్, అజయ్, పి. పోచయ్య, ప్రకాష్, సురేష్, స్వామి తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సింగరేణి థర్మల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం.

**120 మందికి వైద్య సేవలు - ప్రారంభించిన ఈడీ చిరంజీవి.**





**మంచిర్యాల జిల్లా -జూలై 12 (మహప్రభ)**
సింగరేణి ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది కుటుంబాల సంక్షేమమే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ఆదివారం జైపూర్ మండల పరిధిలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ)లో ఉచిత పిల్లల మరియు చర్మ వ్యాధుల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసింది. ఈ వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఈడీ ఎస్టీపీపి సీహెచ్. చిరంజీవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పిల్లల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలి అని సూచించారు. ఈ మెగా వైద్య శిబిరంలో మంచిర్యాల అవని హాస్పిటల్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రఘువంశీ, చర్మ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ రోజిత వైద్య సేవలు అందించారు. శిబిరంలో మొత్తం 50 మంది చిన్నారులు పిల్లల వైద్య సేవలు పొందగా, 70 మంది చర్మ సంబంధిత సమస్యలకు చికిత్స పొందారు. మొత్తంగా 120 మంది ఈ శిబిరం ద్వారా లబ్ధి పొందారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం ఎం. నరసింహారావు, డిస్పెన్సరీ డాక్టర్ జానకి, రిటైర్డ్ డాక్టర్ ప్రభాకర్‌తో పాటు ప్లాంట్ ఇతర అధికారులు, ఉద్యోగులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ దుర్గ సోనాబాయి వార్షికోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని



**అమీర్‌పేట్ -జూలై 12 (మహప్రభ)**
అమీర్ పేట లోని శ్రీ లక్ష్మీ దుర్గ సోన బాయమ్మ ను మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన పూజలలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయనను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్ కుమార్, గులాబ్ సింగ్ గోపీలాల్ చౌహన్, గోసుల సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు

# ఆరు మందిని హతమార్చిన రాజ్ కుమార్ ను ఉరి తీయాలి...

-రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తిక్..




**శంషాబాద్ -జూలై 12 (మహప్రభ)**
దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సైకో రాజు కుమార్ నరమొదం అందరిని దిగ్భ్రాంతికి గురి అయిన దానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉరి తీయాలని రాష్ట్ర ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తిక్ అన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలో జిల్లా ఉప సర్పంచ్ ల పోరం అధ్వర్యంలో మొన షాబాద్ లో సైకో రాజు కుమార్ అరుమందిని నరమేధం చేసిన కాసహికి వేతిరేకంగ నాడి రోడ్డుపై ఉరితియ్యాలని శంషాబాద్ పట్టణంలో లో భారీ ఎత్తున కోవ్వుతుల ర్యాలీ నిర్వహించి చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేరాలని మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సైకో రాజును ప్రభుత్వం వెంటనే స్పందించి కిరాతకుని నడిరోడ్డుపై ఉరితీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తిక్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు భాస్కర్, గౌరవ అధ్యక్షులు రాళ్ల బండి శివకుమార్ గౌడ్, రోహిత్ కుమార్, ప్రవీణ్ కుమార్ యాదవ్, నరేష్, గోవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలే మందు మానసిక ఒత్తిడికి ఫుల్ స్టాప్...



**చేగుంట -జూలై 12 (మహప్రభ)**
మెదక్ జిల్లా చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో, రెడ్డిపల్లి ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు.సీజన్ 3 లో భాగంగా మొత్తం 8 జట్లు పాల్గొనడం జరిగింది. దీనికి స్పాన్సర్ గా కరికే ఆనంద్ రాజ్, ప్రవీణ్ కుమార్, వ్యవహరిస్తున్నారు, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ గా రంజిత్, గణేష్ చందన్ , రాజు, విక్కీ, ప్రేమ్ వ్యవహరిస్తున్నారు. విన్నర్ జట్టుకు 15000 మనీ ప్రైస్,రన్నర్ జట్టుకు 10000 మనీ ప్రైస్ ఉన్నదని తెలిపారు. దీనిలో రెడ్డిపల్లి సీనియర్ జట్టు పాల్గొని, ప్రోత్సహించడం జరిగింది. సీనియర్ జట్టులో విద్యానంద్, దిలీప్, బ్రహ్మచారి, రావుల వెంకటేష్, రావుల వేణు, ప్రశాంత్, బండారి సాయి, తదితరులు పాల్గొన్నారు..

## మోహన్‌నగర్ చౌరస్తాలో నూతన వినాయక బజాజ్ టూ వీలర్ షోరూం ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్







**కొత్తపేట – 12 జూలై( మహప్రభ )**
కొత్తపేట డివిజన్ పరిధిలోని మోహన్ నగర్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన వినాయక బజాజ్ టూ వీలర్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ షోరూంను ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు రవీంద్ర కుమార్ , లాల్ ప్రసాద్ ని అభినందించిన నాయకోటి పవన్ కుమార్ , వారి వ్యాపారం నిరంతరం అభివృద్ధి చెందాలని, వినియోగదారుల విశ్వాసాన్ని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. నాణ్యమైన వాహనాలు, ఉత్తమ సేవలు, పారదర్శకమైన వ్యాపార విధానాలతో ప్రజలకు విశ్వసనీయమైన సేవలను అందిస్తూ సంస్థ మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాత్రు నాయక్ , షోరూం నిర్వాహకుల కుటుంబ సభ్యులు, బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ , వెంకట్ రెడ్డి , కొత్త తిరుమల , పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కుమ్మర్ల తొలి బోనం జాతరకు ఆహ్వాన కరపత్రాల పంపిణీ..

**– జూలై 16న ట్యాంక్‌బండ్‌కు భారీగా తరలిరావాలని పిలుపు.**



**ఎల్‌బినగర్ – 12 జూలై (మహప్రభ)**
ఈ నెల జూలై 16, 2026న హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించనున్న కుమ్మర్ల తొలి బోనం జాతరను విజయవంతం చేయడానికి తెలంగాణ రాష్ట్ర కుమ్మరసంఘం ఆధ్వర్యంలో ఆహ్వాన కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మరసంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శులు ఎగిరిశెట్టి వీరయ్య , నిమ్మలూరి శ్రీనివాస్ , బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆడల గణేశ్ , కో–కన్వీనర్ సంగెం లడ్డు కలిసి మరియు రాగ్య కృష్ణయ్య కుమ్మరసంఘం ప్రతినిధులకు కుమ్మర్ల తొలి బోనం జాతర ఆహ్వాన కరపత్రాలను అందజేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుమ్మర సమాజ ఆత్మగౌరవం, సంప్రదాయాలు, సంస్కృతిని చాటిచెప్పే ఈ చారిత్రాత్మక బోనం జాతరలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కుమ్మర సోదరులు, సోదరీమణులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కుమ్మర సమాజ ఐక్యతను మరింత బలోపేతం చేసే ఈ బోనం జాతరను ఘన విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మరసంఘం నాయకులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం అంటే కేవలం ఒక బ్యారేజ్ కాదు- తెలంగాణ జీవధార

**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ జూలై 12( మహా ప్రభ)**
కాళేశ్వరం అంటే కేవలం ఒక బ్యారేజ్ కాదు -- తెలంగాణ జీవధార అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పేర్కొన్నారు.
కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను కేవలం ఒక బ్యారేజ్‌గా చూడడం సరైనది కాదని ఆయన అన్నారు. ఇది వందల కిలోమీటర్ల మేర విస్తరించిన కాలువలు, సొరంగ మార్గాలు (టన్నెల్స్), ఆసియాలోనే అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్‌లు, అత్యాధునిక భారీ సబ్‌స్టేషన్లు, బాహుబలి మోటార్లు, లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విశాల రిజర్వాయర్ల సమాహారమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలో సాగునీటి విస్తరణతో పాటు రైతులకు స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వచ్చాయని, అనేక ప్రాంతాల్లో వ్యవసాయాభివృద్ధికి కాళేశ్వరం కీలకంగా నిలిచిందని తెలిపారు. కాళేశ్వరం వంటి భారీ ఇంజినీరింగ్ నిర్మాణం తెలంగాణ అభివృద్ధి చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలిచిందని, ఇది రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచే ప్రాజెక్టు అని అన్నారు.

## నాణ్యమైన వైద్యం అందించాలి

**-దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్**



**దేవరకొండ జూలై 12( మహా ప్రభ)**
పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రతి ఆసుపత్రి బాధ్యత అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరుద్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటు ధరల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నాణ్యమైన సేవలు అందిస్తూ రోగుల ఆరోగ్య సంరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. వైద్య సేవల్లో మానవత్వం, బాధ్యత, సేవాభావం అత్యంత ముఖ్యమని పేర్కొన్న ఆయన, ప్రతి రోగికి మెరుగైన చికిత్స అందేలా వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు. భవిష్యత్తులో ఆరుద్ర మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెంది ప్రజలకు విశ్వసనీయమైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రామావత్ మోహన్ కృష్ణ,బొంగరాల గణేష్,ఆసుపత్రి యాజమాన్యం, వైద్య సిబ్బంది, అలాగే పలువురు ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యవారిగూడ గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నక్క లక్ష్మయ్య యాదవ్ నియామకం





నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**ఇబ్రహీంపట్నం – జూలై 12 (మహప్రభ)**
యాచారం మండలంలోని అయ్యవారిగూడ గ్రామ కాంగ్రెస్ కమిటీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , అయ్యవారిగూడ గ్రామానికి చెందిన నక్క లక్ష్మయ్య యాదవ్‌ను గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారిక నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రెండో దశ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు.
గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. నియామక పత్రం అందుకున్న గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నక్క లక్ష్మయ్య యాదవ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, డీసీసీ ఉపాధ్యక్షులు ముత్యాల వెంకటరెడ్డి, బీఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిల్లకంటి శేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు దేంది రాంరెడ్డి, కేషమోని రాజు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ లిక్కి శ్రీనివాస్ రెడ్డి, వెంకట నరసింహారెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాశం జయప్రకాష్, మాజీ ఉపసర్పంచ్‌లు నక్క మహేందర్, కొప్పు వెంకట్ స్వామి, పండరి, రాములు, మల్లయ్య, కరుణాకర్ రెడ్డి, నందు, పాండు, అంజయ్య, కిష్టయ్య, చెన్న కేశవులు, ముత్యాలు, రవి, శ్రీనివాస్, మోతీలాల్, లచ్చ, శంకర్, నరేందర్, రాజ్‌కుమార్, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులతో కలిసి ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించిన బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

**-ఓటు హక్కు పరిరక్షణకు ప్రజలు ముందుకు రావాలని పిలుపు**



**గడ్డి అన్నారం – జూలై 12 (మహాప్రభ)**
ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ సీనియర్ నాయకులు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఈరోజు ఉదయం తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎస్ ఐ ఆర్ ఫారాలను పూర్తి చేసి, గడ్డిఅన్నారం డివిజన్ ఇంచార్జి బాబురావు కి అధికారికంగా సమర్పించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని అవసరమైన ఎస్ ఐ ఆర్ ఫారాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామా తదితర వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి కుటుంబాన్ని చేరుకుని అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రతి అర్హులైన ఓటరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కోరారు.

## ప్రజలకు మరింత చేరువగా పోలీసు వ్యవస్థ

**- బాన్సువాడలో పోలీసు మౌలిక సదుపాయాల విస్తరణకు మరో ముందడుగు**

**-రూ.44 లక్షలతో బాన్సువాడలో నూతన రూరల్ సర్కిల్ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్ అవుట్‌పోస్ట్, పోలీస్ హెల్త్ అవుట్‌పోస్ట్, సదరం క్యాంప్ ప్రారంభం,**

**-"పోలీసు వ్యవస్థ ప్రజలకు ఎల్లప్పుడూ భరోసాగా ఉంటుంది" -- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్**

**-'శాంతిభద్రతలే అభివృద్ధికి పునాది"**

**-- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి**







**కామారెడ్డి జూలై 12 (మహాప్రభ)**
తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్, తెలంగాణ రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, ప్రజాప్రతినిధులు, పోలీసు మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో రూ.44 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన బాన్సువాడ రూరల్ సర్కిల్ కార్యాలయ భవనం, ట్రాఫిక్ పోలీస్ అవుట్‌పోస్ట్, ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పోలీస్ హెల్త్ అవుట్‌పోస్ట్, సదరం క్యాంప్‌లను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, మాట్లాడుతూ, దేశం, రాష్ట్రం, ప్రాంతం అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అత్యంత కీలకమని అన్నారు. ప్రజలకు రక్షణ, భద్రత ఉన్న ప్రాంతాల్లోనే పెట్టుబడులు, అభివృద్ధి, సంక్షేమం వేగంగా జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ దూరదృష్టితో పనిచేస్తూ కామారెడ్డి జిల్లాను మరియు బాన్సువాడ నియోజకవర్గంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పేందుకు సమర్థవంతమైన చర్యలు చేపట్టారని కొనియాడారు. ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా కామారెడ్డి పోలీసులు పనిచేస్తున్నారని అభినందించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ, పోలీసు వ్యవస్థ ప్రజలకు ఎల్లప్పుడూ భరోసాగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆధునిక మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తోందన్నారు. ప్రజలు నిర్భయంగా పోలీసులను కలిసి తమ సమస్యలను వివరించేందుకు అనువైన వాతావరణం కల్పించడమే ఈ భవనాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. పోలీసు వ్యవస్థ బలోపేతం కావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలుగుతామని పేర్కొన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, 2024--2025 సంవత్సరాల్లో చేపట్టిన రోడ్డు భద్రత చర్యల ఫలితంగా సుమారు 50 మంది ప్రాణాలను కాపాడగలిగామని ఎస్పీ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, విస్తృత అవగాహన కార్యక్రమాలు, చట్టాల కఠిన అమలుతో ప్రమాదాలను మరింత తగ్గించేందుకు నిరంతరం చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. Arrive alive దారా ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు తెలంగాణ రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం పోలీసు శాఖ మౌలిక వసతులను బలోపేతం చేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజల భద్రత, సంక్షేమం కోసం పోలీసు శాఖ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బాన్సువాడ టౌన్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్, బాన్సువాడ రూరల్ ఇన్‌స్పెక్టర్, బిచ్కుంద ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, వైద్య శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రామాయంపేట గాంధీ రోడ్ విస్తరణకు సర్వే ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారుల పర్యటన



**రామాయంపేట, జూలై 12 (మహాప్రభ):**
ఎన్నో ఏళ్లుగా రామాయంపేట పట్టణ ప్రజలకు ఇబ్బందిగా ఉన్న గాంధీ రోడ్ విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆదేశాల మేరకు డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు గాంధీ మెయిన్ రోడ్డు సాంకేతిక విపరిజ్ఞానంతో సర్వే నిర్వహించారు. రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ పాలకవర్గం ఈ నిర్ణయం తీసుకుంది. సర్వేలో తహసీల్దార్, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ విస్తరణతో రామాయంపేట గాంధీ మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ డివిజన్ జూలై 12 ( మహా ప్రభ )**
డిండి మండలం దాసరినెమిలిపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీ లక్ష్మణ్ వివాహ వేడుకలకు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. దేవరకొండ పట్టణంలోని ఆదివారంశివ సాయి గార్డెన్లో నిర్వహించిన ఈ వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివాహానికి విచ్చేసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పరిశుభ్రత కరువైన చిల్డ్రన్ పార్క్

**-అధికారులు స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**



**శివంపేట్, జూలై 12(మహాప్రభ):** శివంపేట్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న చిల్డ్రన్ పార్క్ ప్రస్తుతం చెత్తాచెదారం, గడ్డి పొదలతో నిండిపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం వేళ చిన్నారులు ఈ పార్కుకు ఆటల కోసం వస్తుండగా, పార్కు నిర్వహణ సరిగా లేకపోవడం వల్ల వారి భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
వర్షాకాలం కారణంగా పార్కులో గడ్డి, దట్టమైన పొదలు పెరిగిపోవడంతో దోమలు, విషపురుగులు, ఇతర క్రిమికీటకాలు అధికంగా సంచరిస్తున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో చిన్నారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. అందువల్ల సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పార్కులోని చెత్తాచెదారాన్ని తొలగించడం, గడ్డి పొదలను శుభ్రం చేయించడం, పార్కును పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## డీఏపీ కొరత.. ఆందోళనలో రైతులు

**-రామాయంపేటలో ఎరువుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆఫీస్ వద్ద బారులు తీరిన జనాలు**



**రామాయంపేట, జూలై 12 మహాప్రభ**
వర్షాలు కురుస్తున్నా డీఏపీ ఎరువుల కొరతతో రామాయంపేట మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు సమయానికి ఎరువులు అందకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. మండలంలోని ఎరువుల డీలర్ల వద్ద ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. ఉన్న స్టాక్ త్వరగా అయిపోవడంతో చాలామంది రైతులు ఖాళీ చేతులతో వెళ్లాల్సి వస్తోంది.
**రైతుల ఆవేదన:**
"విత్తనాలు వేసిన టైంకు డీఏపీ దొరకడం లేదు. ప్రతి డీలర్ దగ్గర అడుగుతున్నా స్టాక్ లేదు అంటున్నారు. పంటలు ఎండిపోతున్నాయి" అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి మండలానికి తగినన్ని డీఏపీ బస్తాలు కేటాయించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ అయినా పట్టించుకోని ఏరువుల కొరత ఉండకుండా చూడాలని రైతులు కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

**దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ఆశీర్వాదంతో నల్గొండ జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన హనుమంతు వెంకటేష్ గౌడ్.**



**దేవరకొండ డివిజన్ జులై 12 ( మహా ప్రభ )**
హైదరాబాద్ హబ్సిగూడలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి, తనపై ఉంచిన నమ్మకానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ పట్టణ 7వ వార్డు కౌన్సిలర్ హనుమంతు సాయిచంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన నారిమళ్ల ప్రవళికకు ఎమ్మెల్యే నేనావత్ బాలూ నాయక్ అభినందనలు

**దేవరకొండ జూలై 12 ( మహాసభ)**
చైనాలోని ఓర్డోస్‌లో జరిగిన 1వ ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్-2026లో "మహిళల 4ఇ400 మీటర్ల రిలే" రేసులో అద్భుత ప్రదర్శనతో లిస్వర్ణ పతకం సాధించిన గ్రామీణ క్రీడా కెరటం నారిమల్ల ప్రవళికకు దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్ తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. "డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీ" విద్యార్థిని అయిన ప్రవళిక అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి పతాకాన్ని ఎగురవేయడమే కాకుండా, మన దేవరకొండ నియోజకవర్గానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకువచ్చిందని కొనియాడారు. డిండి మండలం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన నా నారిమల్ల ప్రవళిక, అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం



సాధించడం మన గ్రామీణ ప్రాంతాల్లోని అద్భుతమైన ప్రతిభకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "మన దేవరకొండ నియోజకవర్గానికి చెందిన ఒక ఆడబిడ్డ అంతర్జాతీయ క్రీడా వేదికపై త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడం మనందరికీ గర్వకారణం" అని ఎమ్మెల్యే బాలు నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

"డిండి మైదానంలో కఠినమైన శిక్షణ పొంది, ఈ రోజు చైనా వేదికగా బంగారు పతకం గెలవడం రాష్ట్రంలోని వేలాది మంది యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకం." ప్రవళికను ఒక అంతర్జాతీయ ఛాంపియన్‌గా తీర్చిదిద్దడంలో అహర్నిశలు కృషి చేసిన ఆమె కోచ్ పస్పుల పరుశు రాముడు కి, డిండి స్పోర్ట్స్ అకాడమీ యాజమాన్యానికి ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా మౌలిక వసతులను మరింత మెరుగుపరచడానికి, ప్రతిభావంతులైన యువతకు ప్రభుత్వం తరపున పూర్తి మద్దతు అందించడానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామనినేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఏర్పాట్లు పూర్తి.

**-ఈనెల 13రేపు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం ( ఎన్.డి.డి)**

**మెదక్ జిల్లా -12జూలై (మహాప్రభ )**
మెదక్ జిల్లాలో నిర్వహించబోయే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 తారీకున నిర్వహించే . జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లాలో ఈ కార్యక్రమా నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.జూలై 13 జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ( నేషనల్ డీ - వార్మింగ్ డే) సంధర్భంగా 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలన్నారు.ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంభందించిన ట్రైనింగ్ లను పి.హెచ్.సి.లలో పూర్తి చేశామని , వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాఠశాలలు , కళాశాలలలో ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అవగాహన కల్పిస్తున్నారని, జిల్లాలో1-19 సంవత్సరాల పిల్లలు 181425 ( లక్షా ఎనభై ఒకవేయి నాలుగు వందల ఇరవై ఐదు ) వుండగా 236400 ( రెండు లక్షల ముప్పై ఆరువేల నాలుగు వందల ) అల్బెండజోల్ మాత్రలు సిద్ధంగా ఉంచామని , అన్నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరిపడ మాత్రలను పంపించామని, ఉదయం స్కూల్



లో ప్రార్థన చేసిన తర్వాత పిల్లలకు చేతుల పరిశుభ్రత, అల్బెండజోల్ మాత్రల గురించి తెలియజేయాలన్నారు. ఈనెల 13వ తేదీన మాత్రలు వేసుకోని పిల్లలకు తేది: 20.07.2026 నాడు మాపప్ కార్యక్రమం. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు , ఆశ కార్యకర్తలు పాఠశాలల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.అల్బెండజోల్ మాత్ర - కడుపులో పెరిగే నులిపురుగులను నిర్మూలిస్తుంది. పిల్లలలో మంచి ఎదుగుదలతో పాటు చురుగ్గా, మానసిక శారీరక ఆరోగ్యంగా వుంటారు .. అల్బెండజోల్ వల్ల పిల్లలకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు . నిపుణులైన పిల్లల వైద్యుల సేవలు . అందుబాటులో ఉంచుతున్నామన్నారు.. గోర్లు శుభ్రంగాను, చిన్నవిగా వుండాలని, శుభ్రమైన నీటినే త్రాగాలని, తినే పదార్థాలపై మూతలు పెట్టాలని, పండ్లు కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలని, భోజనం చేసేముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, బహిరంగ మల విసర్జన చేయరాదన్నారు. మరుగుదొడ్డిని ఉపయోగించాలని, పాదరక్షలు ధరించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కడుపులో నులి పురుగులు వుంటే పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, అలసట, శారీరక మానసిక అభివృద్ధి సరిగ్గా ఉండకపోవడం, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బలహీనత, బరువు తగ్గడం మొదలైన అనేక సమస్యలు వుంటాయని, నులిపురుగుల నిర్మూలన ( అల్బెండజోల్ మాత్ర ) వల్ల చదువులు, ఆట పాటల్లో చురుగ్గా వుండడం , మెరుగైన రక్తహీనత, మెరుగైన పోషకాహార స్థితి, పాఠశాలలో మెరుగైన హాజరు ( డ్రాప్ అవుట్ లేకపోవడం) మొదలైన అనేక ప్రయోజనాలు వున్నందున ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వొకేషనల్ కళాశాలలు, రిహాబిలిటేషన్ సెంటర్లు, రెస్క్యూ హోమ్స్, లేబర్ , మైగ్రెంట్, స్ట్రీట్ చిల్డ్రన్ హోమ్స్ , చైల్డ్ కేర్ హోమ్స్ , అనాథ ఆశ్రమాలు , అంగన్వాడి సెంటర్లు అన్నీ చోట్ల వుండే పిల్లల కోసం ఆక్షన్ ప్లాన్ సిద్ధం చేసి పర్యవేక్షణ చేస్తున్నామని ,మీ పిల్లలను నులిపురుగుల ( సాయిల్ ట్రాన్స్మిటెడ్ హెల్మంతీస్ ) నుండి రక్షించాలని, 13 తేది నాడు అల్బెండజోల్ మాత్రలు వేసుకోని పిల్లల కోసం 20 వ తేది నాడు మాపప్ కార్యక్రమం నిర్వహిస్తామని, జిల్లా అధికారులు , మీడియా , ప్రభుత్వ , ప్రైవేట్ విద్యా సంస్థలు, తలిదండ్రులు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ కలెక్టర్ అన్నారు.

## ఇస్లాంపూర్ లో (సర్) ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ వేగవంతం.

**తూప్రాన్, జూలై 12.(మహాప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామంలో తూప్రాన్ మండల బిజెపి అధ్యక్షులు పిట్ల పోచయ్య నేతృత్వంలో (సర్) ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరు తమ ఓటు ప్రక్రియను క్రమంగా పొందు పరచుకోవాలని సూచించారు.




ఇందులో డబుల్ ఓట్లుగా ఉన్న వాటిని, నూతన యువకుల ఓట్లను చేర్చుటకు, పేరులో తప్పు ఉన్న వాటిని సరి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గొల్లపల్లి సంతోష్ రెడ్డి, మండల సెక్రెటరీ అంబటి మహేష్ యాదవ్, బూతు అధ్యక్షుడు జోడు నవీన్, నర ప్రశాంత్, దుండిగళ్ళ మధు, జోడు సందీప్, మన్నె స్వామి, బైండ్ల బిక్షపతి, నర్రా శివకుమార్ తదితరులు ఉన్నారు.

## రామాయంపేట 9వ వార్డులో ఎస్ఐఆర్ ప్రక్రియ

**దుర్గమ్మ బస్తీలో ఇంటింటి సర్వేతో ఓటర్ల జాబితా పరిశీలన**



**రామాయంపేట, జూలై 12 (మహాప్రభ)**
రామాయంపేట మున్సిపాలిటీ 9వ వార్డు పరిధిలోని దుర్గమ్మ బస్తీలో శనివారం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు సంబంధించిన వివరాలను సేకరించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా, ఎవరూ మిగిలిపోకుండా శాతం వంద కవరేజ్ సాధించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పుట్టి నరేష్, బాబు, బసనపల్లి కృష్ణ, దేవుని నర్సింలు, పుట్టి సాయిలు, ఎర్రగొల్ల మహేష్ తదితరులు పాల్గొని అధికారులకు సహకరించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అర్హత లేని పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులను కోరారు.

# ప్రజా స్పందన అమోఘం..

**- రెండో రోజూ ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్‌లో ఓటర్లకు సేవలందించిన భవాని ప్రవీణ్ కుమార్.**

**గడ్డిఅన్నారం-జూలై 12 (మహప్రభ)**
గడ్డిఅన్నారం డివిజన్‌లో ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్ ఐ ఆర్ ఓటరు సహాయక కేంద్రాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రెండో రోజు కూడా భవాని ప్రవీణ్ కుమార్ స్వయంగా హెల్ప్ డెస్క్‌లో కూర్చొని ఓటర్ల సందేహాలను వారికి అవసరమైన సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా భవాని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రారంభించిన రెండు హెల్ప్ సెంటర్ల ద్వారా మొదటి రోజే 600 మందికి పైగా ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారమ్‌లకు సంబంధించిన సందేహాలను వివరించడం జరిగింది, హెల్ప్ సెంటర్ల కేంద్రాల సేవలను వినియోగించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.



ప్రజల్లో ఓటు హక్కుపై ఉన్న చైతన్యం ప్రజాస్వామ్యానికి బలాన్నిస్తుంది అని అన్నారు. రెండో రోజు కూడా హెల్ప్ డెస్క్‌కు వచ్చిన ఓటర్లతో మాట్లాడి, ఎన్యుమరేషన్ ఫారమ్‌ల భర్తీ, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల్లో మార్పులు-చేర్పులు, ఇతర ప్రక్రియలపై ఉన్న సందేహాలకు అక్కడికక్కడే సమాధానాలు ఇచ్చి, ఫారమ్‌లను సక్రమంగా పూర్తి చేసుకునేలా మార్గనిర్దేశం చేశారు. అనంతరం హెల్ప్ డెస్క్‌లో విధులు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలకు పలు సూచనలు చేస్తూ, డివిజన్‌లోని ఏ ఒక్క అర్హుడైన ఓటరు కూడా సాంకేతిక కారణాలతో ఓటు హక్కును కోల్పోకుండా ప్రతి ఒక్కరికీ సహకారం అందించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా లేదా అధికారుల నిర్లక్ష్యం కనిపించినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్‌లకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సేవలను వినియోగించుకోవడం పట్ల భవాని ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు తన ఓటు హక్కును తప్పకుండా పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# బిజినెస్


## శాంసంగ్ కొత్త ఫోల్డబుల్ ఫోన్లు

**రూ.999తో ప్రీ-బుకింగ్ ఆఫర్!**



శాంసంగ్ తన కొత్త జెడ్ ఫోల్డ్ 8, జెడ్ ఫోల్డ్ 8 అల్ట్రా, జెడ్ ఫ్లిప్ 8 మోడళ్లను అధునాతన ఏఐ ఫీచర్లతో విడుదల చేయనుంది. ఈ ఫోన్లను కేవలం రూ. 999 టోకెన్ అమౌంట్‌తో ప్రీ-రిజర్వ్ చేసుకోవచ్చు. ఈ మొత్తం రీఫండబుల్. జులై 22న భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు జరిగే ఈవెంట్‌లో గెలాక్సీ వాచ్ 9, గెలాక్సీ వాచ్ అల్ట్రా 2, ఆండ్రాయిడ్ XR స్మార్ట్ గ్లాసెస్ కూడా ఆవిష్కరించే అవకాశం ఉంది. కొత్త ఫోన్లు పాత వాటి కంటే స్లిమ్, తేలికైనవి, దృఢమైనవిగా ఉంటాయి.

## కేవలం రూ.7 లకే జత చెప్పులు!



తక్కువ పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి ఢిల్లీలోని టెలివారా ఫుట్‌వేర్ మార్కెట్ మంచి అవకాశంగా నిలుస్తోంది. ఇక్కడ చెప్పులు, శాండిల్స్, స్పోర్ట్స్ షూస్ వంటి అనేక రకాల ఉత్పత్తులు అతి తక్కువ ధరలకు లభిస్తాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది వ్యాపారులు ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి పెద్ద మొత్తంలో సరుకులు కొనుగోలు చేస్తుంటారు. సుమారు రూ.20 వేల పెట్టుబడితోనే చిన్న స్థాయిలో వ్యాపారం ప్రారంభించవచ్చు. రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు పెట్టుబడితో మరింత విస్తృతంగా స్టాక్ సిద్ధం చేసి విక్రయాలు నిర్వహించవచ్చు.

## ఆషాడంలో బంగారం ధర పెరుగుతుందా? తగ్గుతుందా..?

**ప్రస్తుతం తులం ధర ఎంత?**

ఆషాడ మాసం ప్రారంభం కానుంది. ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఊగిసలాడుతున్నాయి. గతంలో పరుగులు పెట్టిన బంగారం, వెండి ధరలు క్రమంగా దిగి వస్తున్నాయి. అయితే గత నాలుగైదు రోజుల నుంచి బంగారం, వెండి ధరలు పెద్దగా దిగడం లేదు.. పెద్దగా తగ్గడం లేదు. స్వల్ప మార్పులతో కొనసగుతున్నాయి. తాజాగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది. అయితే నిన్న ఒక్క రోజు బంగారం ధర రూ.500 వరకు తగ్గుముఖం పట్టింది. అదే వెండి ధర రూ.500 వరకు తగ్గింది. తాజాగా జూలై 12 దేశంలోని ప్రధాన నగరాల్లో ధరల వివరాలు తెలుసుకుందాం..

హైదరరాబాద్ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.

విజయవాడ -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.



ఢిల్లీ- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,480 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,450 వద్ద కొనసాగుతోంది.

ముంబై -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.

చెన్నై -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,090 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,33,000 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరు -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.

కోల్‌కతా -24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.

కేరళ -- 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,330 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,32,300 వద్ద కొనసాగుతోంది.

ఇక వెండి విషయానికొస్తే.. హైదరాబాద్, చెన్నై, చెన్నైలలో కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద కొనసాగుతుండగా, ఢిల్లీ, ముంబై, బెంగళూరు సహా ఇతర నగరాల్లో రూ.2,35,000 వద్ద ట్రేడవుతోంది. వెండి ధర నిన్న ఒక్క రోజే 5000 రూపాయల వరకు దిగి వచ్చింది. సాధారణంగా లోకల్ సెంటిమెంట్ ఆధారంగా చూసినట్లయితే బంగారం ధరలు ఆషాడంలో తగ్గుతాయని చాలామంది భావిస్తూ ఉంటారు. దీనికి ఒక ప్రధానమైన కారణం ఉంది ఎందుకంటే ఆషాడమాసంలో పెళ్లిళ్లు శుభకార్యాలు జరగవు. ముఖ్యంగా ఆషాడ మాసంలో బంగారు ఆభరణాల షాపింగ్ కూడా చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపించరు. దీన్ని దృష్టిలో ఉంచుకొని బంగారు దుకాణాల యాజమాన్యాలు కస్టమర్లను ఆకర్షించేందుకు అనేక ఆఫర్లను కూడా ముందుకు తెస్తుంటాయి. అందుకే ఈ మాసంలో ధరలు తగ్గే అవకాశాలు ఉంటాయని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

## రికార్డు స్థాయికి చేరిన భారత్ రష్యా చమురు దిగుమతులు

అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో, భారత్ రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను గణనీయంగా పెంచింది. జూన్ నెలలో ఈ దిగుమతులు మే నెలతో పోలిస్తే 34% పెరిగి రికార్డు స్థాయికి చేరుకున్నాయి. సీఆర్ఈఏ నివేదిక ప్రకారం.. భారత్ దాదాపు 4.5 బిలియన్ యూరోల విలువైన రష్యా ముడి చమురును కొనుగోలు చేసింది. రిలయన్స్, ఐఓసీఎల్, బీపీసీఎల్, నయారా ఎనర్జీ వంటి సంస్థలకు రష్యా సరఫరా పెరిగింది. ఈ ముడి చమురుతో శుద్ధి చేసిన ఇంధన ఉత్పత్తులను భారత్ తిరిగి అమెరికా, ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్ దేశాలకు ఎగుమతి చేస్తోంది.



## ఇంగ్లండ్ కోచ్ పదవికి మెక్‌కల్లమ్ రాజీనామా..!

ఇంగ్లండ్ ప్రధాన కోచ్ పదవికి బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామా చేశాడు. ఇటీవల జట్టు చెత్త ప్రదర్శనతో విమర్శల పాలైన మెక్‌కల్లమ్ ఆదివారం తాను కోచ్‌గా వైదొలుగుతున్నట్టు ప్రకటించాడు. కెప్టెన్‌గా బెన్ స్టోక్స్ వైదొలగడంతో.. 'ఇక నేను ఉండి ఏం లాభం' అనుకున్నాడేమో తాను కూడా సుదీర్ఘ ఫార్మాట్‌లో కోచింగ్ ఇవ్వలేనని చెప్పేశాడు.సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో టెస్టు మధ్యలోనే బెన్ స్టోక్స్ రిటైర్మెంట్ అనంతరం తదుపరి హెడ్‌కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ రాజీనామానే బాకీ అనుకున్నారంతా. అందరూ ఊహించినట్టే విమర్శకులకు మరింతగా తిట్టిపోసే అవకాశమివ్వకుండా మెక్‌కల్లమ్ వైదొలిగాడు. ఐదు టీ20ల సిరీస్‌లో భారత్‌ను హ్యారీబ్రూక్ సేన వైట్‌వాష్ చేసిన మరునాడే అతడు బైబై బాంబ్ పేల్చాడు.'బజ్ బాల్' ఆటతో టెస్టులకు కొత్త రూపునిచ్చిన మెక్‌కల్లమ్‌ను ఇటీవల యాషెస్ సిరీస్‌లో ఓటమి, స్వదేశంలో న్యూజిలాడ్ చేతిలో 1-2తో సిరీస్ కోల్పోవడం వంటివి బాధించాయి. విఫల కోచ్‌గా ఉండడం కంటే బాధ్యతల నుంచి తప్పుకోవడమే సరైందని అతడు భావించాడు. ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆదివారం తన



నిర్ణయాన్ని ప్రకటించాడు బజ్. టెస్టు కోచ్‌గా వైదొలిగిన మెక్‌కల్లమ్ వైట్ బాల్ క్రికెట్‌లో (వన్డే, టీ20ల్లో) తన సేవలు కొనసాగించనున్నాడు.

**2022లో బాధ్యతలు**

న్యూజిలాండ్ ఓపెనర్‌గా మెక్‌కల్లమ్ ఎన్నో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఐపీఎల్ ఆరంభ సీజన్ 2008లోనే శతకం బాదిన అతను 2022లో క్రిస్ సిల్వర్‌వుడ్ అనంతరం ఇంగ్లండ్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఆ సమయానికి ఆ జట్టు టెస్టుల్లో వరుస ఓటములను చవిచూస్తోంది. అలాంటి జట్టును ఒక్క ఏడాదిలోనే మెక్‌కల్లమ్ మార్చేశాడు. తన స్టయిల్ విధ్వంసక ఆటను జట్టుకు ఒంటబట్టించాడు.స్ట్రోక్ ప్లేతో అలరించే బెన్ స్టోక్స్ కెప్టెన్(దీవఅ అయ్యాక అతడి పని మరింత సులువైంది. మెక్‌కల్లమ్‌ను అభిమానులు ముద్దుగా 'బాజ్' అని పిలుస్తారు. దాంతో, అతను నేర్పిన ఆటకు 'బాజ్‌బాల్' అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. గత ఏడాది నుంచి ఇంగ్లండ్ టెస్టుల్లో అదరగొడుతోంది. పాకిస్థాన్ పర్యటనలో స్టోక్స్ సేన మూడు టెస్టులు నెగ్గి రికార్డు సృష్టించింది. ఆ తర్వాత స్వదేశంలో ఐర్లాండ్ తో జరిగిన ఏకైక టెస్టులోనూ సంచలన విజయం సాధించింది.

## భారత వన్డే, టీ20 స్క్వాడ్‌లో మార్పులు.. ప్రిన్స్, బిష్ణోయ్‌కు పిలుపు..!

ఇంగ్లండ్ చేతిలోనూ టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన భారత జట్టు వన్డే సమరానికి సిద్ధమవుతోంది. పొట్టి ఫార్మాట్‌లో పోయిన పరువును వన్డేల్లో విజయంతో దక్కించుకోవాలనే కసితో ఉంది టీమండియా. మరో రెండు రోజుల్లో (జూలై 14 నుంచి) సిరీస్ మొదలవ్వనుండగా ఆదివారం సెలెక్టర్లు స్క్వాడ్‌లో మార్పులు చేశారు. ఇదివరకు ఇంగ్లండ్‌తో వన్డేలకు ప్రకటించిన 15 మంది బృందంలోని హర్షిత్ రాణా, జింబాబ్వేతో పొట్టి సిరీస్‌కు ఎంపిక చేసిన టీ20 స్క్వాడ్‌లోని వరుణ్ చక్రవర్తి స్థానంలో మరొకరిని తీసుకున్నారు టీ20 ఛాంపియన్‌గా విదేశీ పర్యటనల్లో కంగుతిన్న భారత జట్టు వన్డేల్లో ప్రతాపం చూపాలనుకుంటోంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా.. హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్‌ను ఢీకొట్టనుంది. మూడు వన్డేల సిరీస్‌కు మరో రెండు రోజులే ఉన్నందున స్క్వాడ్‌ను పటిష్టం చేసుకుంది భారత్. పొట్టిసిరీస్ మధ్యలో గాయపడిన పేసర్ హర్షిత్ రాణా, మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిలు పర్యటన నుంచి వైదొలగడంతో.. వీరి




స్థానంలో ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌లను ఎంపిక చేశారు సెలెక్టర్లు.ఐపీఎల్ -19 ప్రదర్శనతో జాతీయ జట్టులోకి వచ్చిన ప్రిన్స్ అఫ్గనిస్థాన్‌పై వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అయితే.. మూడు మ్యాచుల్లో రెండు వికెట్లే తీసినా పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్ పర్యటనలో పెద్దగా రాణించని బిష్ణోయ్‌కు మరో అవకాశం దక్కింది. వన్డే సిరీస్ అనంతరం జింబాబ్వే పర్యటన ఉన్నందున.. ప్రిన్స్, బిష్ణోయ్‌లు టీ20 స్క్వాడ్‌లో కూడా భాగం కానున్నారు.


**భారత వన్డే స్క్వాడ్(అప్డేటెడ్):** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, శ్రేయాస్ అయ్యర్(వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివం దూబే, కుల్దీప్ యాదవ్, బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్.

**జింబాబ్వే, టీ20 స్క్వాడ్(అప్డేటెడ్):** శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ వర్మ, తిలక్ వర్మ(వైస్ కెప్టెన్), ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శివం దూబే, సూర్యాన్ష్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్(వికెట్ కీపర్), రవి బిష్ణోయ్.

# స్పోర్ట్స్

## లేటెస్ట్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్..

**టాప్-10 లో ఏ దేశం ఏ స్థానంలో ఉందో తెలుసా?**



యూకే పర్యటనలో వరుస పరాజయాలను చవిచూస్తున్న భారత క్రికెట్ జట్టుకు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. ఐర్లాండ్, ఇంగ్లండ్ చేతిలో ఘోరంగా సిరీస్‌లు ఓడిపోవడంతో టీమిండియా ప్రపంచ నంబర్-1 టీ20 ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని కోల్పోయింది. ఇప్పటివరకు ఒక వెలుగు వెలిగిన భారత్.. తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయింది. మరోవైపు, భారత్‌పై 4-0తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లండ్ జట్టుకు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారీ ప్రయోజనం చేకూరింది. భారత్‌ను కిందకు నెట్టేసి ఇంగ్లండ్ ప్రపంచంలోనే నంబర్-1 టీ20 జట్టుగా అవతరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ జట్లు టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ పొజిషన్‌లో ఉండటానికి ఒకరితో ఒకరు తీవ్రంగా పోటీ పడుతున్నారు. దీని వెనుక ఒలింపిక్ అర్హత అనే ఒక పెద్ద కారణం దాగి ఉంది. డిసెంబర్ 31, 2026 నాటికి ఆసియా, ఆఫ్రికా, యూరప్ ఖండాలలో ఏ జట్టు అయితే టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలుస్తుందో, ఆ జట్టుకు నేరుగా ఒలింపిక్స్ టికెట్ లభిస్తుంది. ఈ నిబంధన కారణంగా కనీసం ఈ ఏడాది చివరి నాటికైనా తమ తమ ఖండాలలో టాప్ ర్యాంక్ సాధించాలనే పట్టుదలతో అన్ని దేశాలు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయి.

**టాప్-10 టీ20 జట్ల వివరాలు.. ఏ దేశం ఏ స్థానంలో ఉందంటే?**

తాజా ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ ప్రకారం టాప్ స్థానాల్లో మార్పులు జరిగాయి. భారత్‌ను ఓడించిన ఇంగ్లండ్ మొదటి స్థానానికి చేరగా, భారత్ రెండో స్థానానికి పరిమితమైంది. అయితే మిగిలిన టాప్-10 జట్ల స్థానాల్లో ఎలాంటి మార్పులు జరగలేదు. ఆస్ట్రేలియా జట్టు మూడో స్థానంలో, న్యూజిలాండ్ నాల్గో స్థానంలో, దక్షిణాఫ్రికా ఐదో స్థానంలో కొనసాగుతున్నాయి. ఇక సాంప్రదాయ ప్రత్యర్థి పాకిస్తాన్ ప్రస్తుతం ఆరో స్థానంలో ఉండగా, వెస్టిండీస్ ఏడో స్థానంలో, బంగ్లాదేశ్ ఎనిమిదో స్థానంలో, శ్రీలంక తొమ్మిదో స్థానంలో, ఆఫ్ఘనిస్తాన్ పదో స్థానంలో స్థిరంగా ఉన్నాయి.

**నాలుగేళ్ల రారాజు స్థానానికి బ్రేక్**


భారత జట్టు దాదాపు సాడే నాలుగేళ్ల తర్వాత టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం నుంచి కిందకు పడిపోవడం గమనార్హం. ఫిబ్రవరి 2022 నుండి భారత్ ప్రపంచంలోనే నంబర్-1 టీ20 జట్టుగా తిరుగులేని వైభవాన్ని ప్రదర్శించింది. ఈ సుదీర్ఘ కాలంలో రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ వంటి దిగ్గజాల కెప్టెన్సీలో టీమిండియా 2024 మరియు 2026 లలో వరుసగా రెండు టీ20 వరల్డ్ కప్ సిరీస్‌లను గెలుచుకుని ప్రపంచ విజేతగా నిలిచింది. కానీ, 2026 టీ20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ స్థానంలో శ్రేయస్ అయ్యర్‌కు టీ20 జట్టు కెప్టెన్సీ బాధ్యతలను అప్పగించారు. కెప్టెన్‌గా అయ్యర్ చేపట్టిన మొదటి యూకే పర్యటనే అతనికి పెద్ద శాపంగా మారింది. దురదృష్టవశాత్తూ కెప్టెన్‌గా ఆడిన మొదటి 7 మ్యాచ్‌లలో ఆయన ఒక్కటంటే ఒక్క విజయాన్ని కూడా అందుకోలేకపోయారు. ఐర్లాండ్‌తో 0-2, ఇంగ్లండ్‌తో 0-4తో సిరీస్‌లను కోల్పోవడంతో, భారత్ తన ప్రతిష్టాత్మక నంబర్-1 కిరీటాన్ని వదులుకోవాల్సి వచ్చింది.

# ప్రియదర్శి 'ఇడుపు కాయితం' షూటింగ్‌కు రెడీ..

## -గ్రామీణ నేపథ్యంలో హార్ట్‌టచింగ్ కథతో రాబోతున్న చిత్రం





వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రియదర్శి మరో ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన హీరోగా, నాగదుర్గ కథానాయికగా నటిస్తున్న 'ఇడుపు కాయితం' సినిమా ప్రస్తుతం శరవేగంగా రూపుదిద్దుకుంటోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన వర్క్‌షాప్ సెషన్స్ విజయవంతంగా పూర్తయ్యాయని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. దీంతో త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. 'ఇడుపు కాయితం' చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు సుకుమార్ రైటింగ్స్ మరియు బన్నీ వాస్ వర్క్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. పల్లె జీవితంలోని భావోద్వేగాలు, బంధాలు, అనుబంధాలను ప్రతిబింబించే స్వచ్ఛమైన గ్రామీణ కథాంశంతో ఈ సినిమా రూపొందుతోంది.పక్కా లోకల్ నేటివిటీకి ప్రాధాన్యం ఇస్తూ కథను తెరకెక్కిస్తున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాలో తెలంగాణ సంస్కృతి, భాష, యాసకు ప్రత్యేక స్థానం ఉండనుంది. అందుకే తెలంగాణ నేపథ్యానికి చెందిన పలువురు నటీనటులను కీలక పాత్రల కోసం ఎంపిక చేసినట్లు సమాచారం. దీంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని వంశీ రెడ్డి దొండపాటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు సుకుమార్ సతీమణి తబితా సుకుమార్ సమర్పణలో, నిర్మాత బన్నీ వాస్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సురేష్ బొబ్బిలి ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు తగ్గట్టుగా హృదయాన్ని హత్తుకునే సంగీతాన్ని అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వర్క్‌షాప్‌లు పూర్తవడంతో నటీనటులు తమ పాత్రలకు పూర్తిగా సిద్ధమయ్యారు. పాత్రల సహజత్వం, గ్రామీణ జీవనశైలిని తెరపై నిజాయితీగా ఆవిష్కరించేందుకు ఈ వర్క్‌షాప్‌లు ఉపయోగపడ్డాయని చిత్ర బృందం తెలిపింది. భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న 'ఇడుపు కాయితం' సినిమాను ఈ ఏడాది డిసెంబర్‌లో గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ప్రియదర్శి గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే నమ్మకంతో చిత్ర బృందం ఉంది. గ్రామీణ నేపథ్యం, హృదయాన్ని హత్తుకునే కథ, బలమైన పాత్రలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి.



# అబ్బా అనిపించేలా నభా నటేష్ అందాలు..

# బాక్సాఫీస్ వద్ద అఖిల్ 'లెనిన్' ర్యాంపేజ్..


## - రెండు రోజుల్లోనే రూ.37.2 కోట్లు!




అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. థియేటర్లలో అఖిల్ ఊరమాస్ పర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకులు ఫిదా అవుతుండటంతో ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన మౌత్ టాక్ లభిస్తోంది. ఆడియన్స్ నుండి వస్తున్న భారీ రెస్పాన్స్‌తో ఈ సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.మొదటి రోజు భారీ ఓపెనింగ్స్ రాబట్టిన ఈ చిత్రం, రెండవ రోజు కూడా అదే జోరును కొనసాగిస్తూ దూసుకుపోతోంది. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో రూరల్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ మరియు మనం ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాకు ఎస్‌ఎస్ థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. చాలా కాలం తర్వాత అఖిల్‌కు సాలిడ్ కమర్షియల్ హిట్ పడటంతో అక్కినేని అభిమానులు థియేటర్ల వద్ద పండగ చేసుకుంటున్నారు. వీకెండ్ ముగిసేసరికి ఈ వసూళ్లు మరిన్ని రికార్డులను బద్దలు కొట్టే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి

# సమంత మా ఇంటి బంగారం అరుదైన ఫీట్..

## -ఇంతకీ ఏంటో తెలుసా..?




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'మా ఇంటి బంగారం'. నందినీ రెడ్డి దర్శకత్వం వహించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సక్సెస్‌ఫుల్ టాక్‌తో రన్ అవుతోంది. సమంత సొంత నిర్మాణ సంస్థ ట్రాలాలా పిక్చర్స్ నిర్మించిన విషయం తెలిసిందే. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఫేమేల్ ఓరియెంటెడ్ సినిమాగా వచ్చిన మా ఇంటి బంగారం కాసుల వర్షం కురిపిస్తోంది. 24వ రోజులోకి ఎంట్రీ ఇచ్చింది.మా ఇంటి బంగారం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటరైంది. ఈ ఫీట్ సాధించిన టాలీవుడ్ ఫీ మేల్ సెంట్రిక్ సినిమాగా అరుదైన రికార్డును ఖాతాలో వేసుకుంది. సమంత భర్త, డైరెక్టర్ రాజ్ నిడిమోర్ ఈ చిత్రానికి కథనందించగా.. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందించాడు. థియాట్రికల్ రన్‌లో ఏ మాత్రం తగ్గేదేలే అంటూ తన జోరు కొనసాగిస్తోంది. మరి రాబోయే రోజుల్లో మా ఇంటి బంగారం ఇంకెన్ని వసూళ్లు రాబడుతుందో చూడాలి. ఓ వైపు గృహిణిగా, మరోవైపు వీరవనితలాగే ఉగ్రరూపం చూపిస్తూ సాగే ఈ సినిమాలో సామ్‌ను సరికొత్తగా కనిపిస్తూ అభిమానులు, మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేస్తోంది. పెళ్లి అయిన అనంతరం పల్లెటూరికి కోడలిగా వెళ్లిన సమంతకి అక్కడ ఎదురైన సంఘటనలు ఏంటి.. తన గతం ఏంటి అనే నేపథ్యంలో సాగే ఈ సినిమాపై మీరూ ఓ లుక్కేయండి మరి.



# నాదీ అదే బాట

'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' సినిమాతో హీరోయిన్‌గా పరిచమైన తెలుగు అమ్మాయి శివానీ నగరం. మొదటి సినిమాతోనే ప్రేక్షకుల మనసులు దోచుకుంది. రెండో సినిమా 'లిటిల్ హార్ట్స్'తో సూపర్ హిట్ కొట్టేసింది. అందులో ఆమె పోషించిన కాత్యాయని పాత్ర బాగా హైలెట్ అయింది. ముచ్చటగా మూడో చిత్రం 'హే బలవంత్'లోనూ మెరిసి మరో విజయాన్ని అందుకున్న ఈ ముద్దుగుమ్మ కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నది. ఈ సందర్భంగా శివానీ పంచుకున్న కార్‌వాన్ కబుర్లు ఇవి నేను పుట్టింది, పెరిగింది అంతా హైదరాబాద్‌లోనే. చిన్నప్పుడే కూచిపూడి నేర్చుకున్నాను. పెద్దాయ్యాక కొన్నిరోజులు కూచిపూడి డ్యాన్స్ టీచర్‌గా పనిచేశాను. సినిమాల్లోకి రాకమందు పాకెట్ మనీ కోసం నా తమ్ముడితో కలిసి హౌస్ ఈవెంట్లు, లైవ్ బ్యాండ్స్, బర్త్‌డే పార్టీలు లాంటి ఈవెంట్లలో పాటలు పాడేదాన్ని. అలా వచ్చిన డబ్బును ఇద్దరం పంచుకునేవాళ్లం. నా మొదటి సినిమాలో పాట పాడాలనుకున్నా కుదరలేదు. నేనే నటించే సినిమాలో ఎప్పటికైనా ఓ గీతాన్ని ఆలపిస్తాను. ఈ మధ్య సోషల్‌మీడియాలో చాలామంది ఒక విషయాన్ని పూర్తిగా వినకుండానే జడ్జ్ చేస్తున్నారు. నా విషయంలోనూ అదే జరిగింది. ఓ ఇంటర్వ్యూలో ఆధ్యాత్మికత గురించి మాట్లాడుతూ.. కేదార్‌నాథ్, రామకోటి రాయడం, షిర్డీ, తిరుమల తిరుపతి శ్రీవారి దర్శనం గురించి చెప్పుకొచ్చాను. శ్రీవారి దర్శనం విషయంలో నా అనుభూతిని పంచుకున్న తీరును అపార్థం చేసుకున్నారు. ఆ విషయంలో క్షమాపణలు కూడా చెప్పాను. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటాను. ఫొటోలు, సినిమా అప్‌డేట్లను షేర్ చేస్తుంటాను. ప్రకృతిని చూస్తే నన్ను నేను మర్చిపోతా. అందుకే తరుచూ రోడ్ ట్రిప్‌లకు వెళ్తుంటా. ఫంక్షన్లు, పండుగలకు చీరకట్టు, లెహంగాల్లో సంప్రదాయంగా తయారవుతాను. 'అంతర్గత' షార్ట్‌ఫిల్మ్‌తో నటిగా అడుగులు వేశాను. ఆ తర్వాత 'మిస్టర్ గర్ల్‌ఫ్రెండ్' వెబ్‌సిరీస్‌లోనూ నటించాను. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండు'లో అవకాశం ఉందని ఇన్‌స్టాగ్రామ్‌లో చూసి ఆడిషన్‌కు వెళ్లాను. స్నేహితురాలి పాత్ర కోసం వెళితే ఏకంగా హీరోయిన్‌నే చేశారు. రెండో సినిమాకే అవార్డు రావడమనేది చాలా సంతోషించే విషయం. 2025 సంవత్సరానికి గాను ప్రదానం చేసిన 'కళావేదిక ఎన్టీయార్' అవార్డులలో ఏకంగా ఆరు పురస్కారాలు 'లిటిల్ హార్ట్స్' చిత్రమే గెలుచుకున్నది. అందులో నాకు ఉత్తమ నటి అవార్డు దక్కడం నా సినీ కెరీర్‌లో తొలిమెట్టుగా భావిస్తున్నాను. తెలుగు అమ్మాయినే అయినా ఇతర భాషల్లోనూ సినిమాలు చేయాలనే కోరిక ఉంది. అందుకే తమిళంలో ఎంట్రీ ఇస్తున్నాను. శివరాజ్ కుమార్ లాంటి సీనియర్ యాక్టర్‌తో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. గతంలో శ్రీదివ్య, అంజలి, బిందుమాధవి, ఆనంది లాంటి తెలుగమ్మాయిలు తమిళ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చున్నారు. నాదీ అదే బాట.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com